
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 48

శుక్రవారం 10-5-2024

SIMULTANEOUSLY PRINTED AT WARANGAL | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

నిశ్చయంగా, నా ప్రభువు తన దాసులలో తాను కోరినవారికి జీవనోపాధిని పుష్కలంగా ప్రసాదిస్తాడు మరియు (తాను కోరిన) వారికి మితంగా ఇస్తాడు. మీరు (ఆయన మార్గంలో) ఖర్చుపెట్టేదంతా ఆయన మీకు తిరిగి ఇస్తాడు. ఆయనే సర్వశ్రేష్ఠుడైన జీవనోపాధి ప్రదాత.

– ఇస్లాం ధర్మం

ఫోకస్

సాక్షి

శుక్రవారం, 10 మే 2024

భరోసా కావాలి!

పిల్ల పోయినా... పురుటి కంపు పోలేదని ఒక ముతక సామెత. కరోనా అనే మాట క్రమంగా విన మరుగవుతూ వస్తున్నా, దాని ప్రకంపనలు మాత్రం మానవాళిని ఆందోళనకు గురి చేస్తూనే ఉన్నాయి. కరోనా టీకా కోవిషీల్డ్‌పై తాజాగా వస్తున్న వార్తలే అందుకు తార్కాణం. సదరు టీకా తీసుకోవడం వల్ల మనిషిలో రక్తం గడ్డలు కట్టడం, రక్తంలోని ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గడం (వైద్య పరిభాషలో 'థ్రోంబో సైటోపేనియా సిండ్రోమ్' – టీటీఎస్) లాంటి అరుదైన దుష్ప్రభావాలుంటా యని దాన్ని రూపొందించిన బ్రిటన్ దిగ్గజ ఔషధ సంస్థ ఆస్ట్రాజెనెకా లండన్ కోర్టులో ఒప్పుకుంది. దాంతో గత వారం గందరగోళం మొదలైంది. తాజాగా ప్రపంచవ్యాప్తంగా ఆ టీకాను ఉపసంహరిస్తున్నట్టు ఆస్ట్రాజెనెకా బుధవారం ప్రకటించడంతో, భారత్‌లో కోవిషీల్డ్‌గా, యూరప్‌లో వాక్స్‌జెవ్రియాగా అమ్ముడైన కోవిడ్ టీకాపై రచ్చ పరాకాష్ఠకు చేరింది. కరోనా టీకాల భద్రతపై చాలాకాలంగా జరుగుతున్న చర్చలకు తాజా పరిణామాలు యాదృచ్ఛికంగా కొత్త ఊపిరినిచ్చాయి. మన దేశంలో సుప్రీమ్ కోర్ట్ సైతం ఆస్ట్రాజెనెకా టీకాపై వచ్చిన పిటిషన్ విచారణకు అంగీకరించడం గమనార్హం.

ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే – కోవిడ్ మహమ్మారితో ప్రపంచం అల్లాడుతున్న సమయంలో ప్రజారోగ్యంలో ఆక్స్‌ఫర్డ్ – ఆస్ట్రాజెనెకా టీకా కీలక భూమిక పోషించింది. క్లినికల్ పరీక్షల అనంతరం 2021 జనవరి 4న టీకా తొలి డోస్ వినియోగించారు. ఆ ఒక్క ఏడాదే దాదాపు 250 కోట్ల డోసులు వేశారు. లక్షలాది ప్రాణాలను కాపాడారు. 2021 ప్రథమార్ధంలో భారతదేశంలో డెల్టా వేరియంట్ పెచ్చరిల్లినప్పుడు కూడా ఇదే సంజీవని. ప్రపంచదేశాల మధ్య టీకాల సరఫరాలో చిక్కులున్నప్పుడూ ఆ మానవతా సంక్షోభ పరిష్కారానికి అందుబాటులో ఉన్న కొన్నిటిలో ఇదీ ఒకటి. ఫైజర్, మోడర్నా, నోవావ్యాక్స్, వగైరాల లానే ఈ టీకా కూడా అనేక స్థాయుల పరీక్షలకు లోనైంది. మూడు విడతల ట్రయల్స్‌లో వేలాది ప్రజలపై పరీక్షలు చేసి, సురక్షితమనీ, ప్రభావశీలమనీ తేలాకనే అనుమతులిచ్చారు. బ్రిటన్ సహా యూరప్‌లోని పలు దేశాల్లో 2021 ఆరంభంలో దీన్ని పంపిణీ చేశారు.

నిజానికి, ఈ టీకా వినియోగం వల్ల కొన్ని దుష్ఫలితాలు ఉండవచ్చని బ్రిటన్ ప్రభుత్వం 2021 ఫిబ్రవరిలోనే చెప్పింది. కానీ, ప్రపంచవ్యాప్తంగా వారానికి 40 లక్షల కొత్త కేసులొస్తూ, కరోనా తీవ్రత భయం రేపుతున్న సమయమది. దిక్కుతోచని ఆ పరిస్థితుల్లో... టీకాతో అరుదుగా వచ్చే ముప్పు కన్నా ఉపయోగాలే ఎక్కువని ప్రపంచ ఆరోగ్య సంస్థ లాంటివి భావించాయి. పైగా, మహిళలు వాడే గర్భనిరోధక మాత్రల లాంటి అనేక ఇతర ఔషధాలతో పోలిస్తే ఈ టీకాతో రక్తం గడ్డలు కట్టే రేటు బాగా తక్కువనీ, ప్రతి వెయ్యిమందిలో ఒక్కరికే ఆ ప్రమాదం ఉంటుందనీ లెక్కల్లో తేల్చారు. అందుకే, ప్రపంచ క్షేమం కోసం ఈ టీకాను కొనసాగించారు. ఇక, భారత్ సంగతెలా ఉన్నా విదేశాల్లో కరోనా టీకాతో సహా ఏ ఔషధంతో ఇబ్బంది తలెత్తినా బాధితులకు నష్టపరిహార పథకాలున్నాయి. అయితే, అక్కడ కూడా నష్టపరిహారం అందడంలో చిక్కులు ఎదురవడంతో సమస్య వచ్చింది. టీటీఎస్ వల్ల బ్రిటన్‌లో కనీసం 81 మంది చనిపోగా, వందల మంది అనారోగ్యం బారిన పడ్డారు. నష్టపరిహారం కోరుతూ బాధిత కుటుంబాలు కోర్టుకెక్కాయి. అలా దాదాపు 51 కేసులు ఎదుర్కొంటున్న ఆస్ట్రాజెనెకా లండన్‌లోని హైకోర్ట్‌లో తొలిసారిగా టీకా దుష్ప్రభావాలను అంగీకరించింది.

సహజంగానే ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా, మరీ ముఖ్యంగా 175 కోట్లకు పైగా కోవిషీల్డ్ టీకా డోసులు తీసుకున్న మన దేశ ప్రజానీకంలో కలకలం రేపింది. ఒక దశలో లక్షలాది ప్రజానీకాన్ని కాపాడి, ప్రపంచానికి రక్షాకవచంగా కనిపించిన టీకా ఇప్పుడిలా భయాందోళనలకు కారణం కావడం విచిత్రమే. కానీ, ప్రాణాంతక మహమ్మారిని కట్టడి చేసేందుకు మరో మార్గం లేని దశలో ఈ టీకాలే దిక్కయ్యాయని మర్చిపోరాదు. ప్రాణరక్షణ కోసం ప్రపంచంలోని అన్ని ప్రభుత్వాలూ, ఔషధ సంస్థలూ టీకాలను తీసుకురావడంలో కొంత హడావిడి పడివుండవచ్చు. లాభనష్టాలపై ప్రజల్ని మరింత చైతన్యం చేసి, టీకా కార్యక్రమం చేపట్టి ఉండవచ్చు. అయితే, కోట్లాది ప్రాణాలకు ముందుగా ప్రాథమిక భద్రతే ధ్యేయంగా టీకాల వినియోగం త్వరితగతిన సాగిందని అర్థం చేసుకోవాలి. పైగా, టీకా దుష్ప్రభావాలు అత్యంత అరుదుగా కొందరిలోనే కనిపిస్తాయని వైద్య నిపుణులు ఇప్పటికీ స్పష్టం చేస్తున్నందున అతిగా ఊహించుకొని ఆందోళన చెందడం సరికాదు.

ఆస్ట్రాజెనెకా వారి టీకా మంచిదే అయినా, ఫైజర్, మోడర్నా లాంటి ఇతర టీకాలు మెరుగైనవని నిపుణుల మాట. మరింత భద్రత, ప్రభావశీలత ఉన్న ఎంఆర్ఎన్ఏ వెర్షన్లు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. దానికి తోడు బాధితుల కేసులు. ఫలితంగా, ఆస్ట్రాజెనెకా తన టీకాలను ఉపసంహరించుకోక తప్పలేదు. కోర్టు కేసులకూ, తమ ఉపసంహరణకూ సంబంధం లేదనీ, రెండూ కాకతాళీయమేననీ ఆ సంస్థ చెబుతున్నా, ఇదంతా నష్టనివారణ చర్యల్లో భాగంగానే కనిపిస్తోంది. అది అటుంచితే, రోగుల భద్రతే తమ ప్రాధాన్యమని ఆస్ట్రాజెనెకా పునరుద్ఘాటిస్తే సరిపోదు. టీకా వాడకం వల్ల తలెత్తిన ఆరోగ్య సమస్యలకు విరుగుడు ఆలోచించి, ప్రజల్లో భరోసా పెంచాలి. బాధ్యత వహించి, బాధిత రోగులకు సత్వర నష్టపరిహారం చెల్లించి తీరాలి. టీకాలో లోపమెక్కడ జరిగిందో క్షుణ్ణంగా పరిశోధించాలి. ప్రభుత్వాలు సైతం ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి. టీకా వినియోగం సురక్షితమేనని ప్రకటించడానికి అనుసరిస్తున్న ప్రమాణాలేమిటో ఒకసారి సమీక్షించాలి. కఠినమైన ప్రమాణాలు పాటించకుండానే కోవిషీల్డ్ వినియోగానికి పచ్చజెండా ఊపిన నియంత్రణ అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఎందుకంటే, ప్రస్తుత పరిణామాలతో ప్రజలకు టీకాల పైన, వాటి తయారీదార్లపైన, చివరకు ఆరోగ్య వ్యవస్థ మీదే నమ్మకం సడలితే అది మరింత ప్రమాదం.

రంగును బట్టి రాజకీయాలా?

విశ్లేషణ



టంకశాల అశోక్

దక్షిణ భారతీయులు ఆఫ్రికన్లను పోలి ఉంటారన్న శామ్ పిట్రోడా వ్యాఖ్యలపై దుమారం రేగింది. ఆధునిక మానవుని ఆవిర్భావం తొలుత ఆఫ్రికాలోనే జరిగిందనీ, అక్కడి నుంచి వారు వివిధ ప్రాంతాలకు వలస పోయారనీ, అందులో ప్రస్తుత భారతదేశం కూడా ఒకటనీ శాస్త్రవేత్తలు అంగీకరిస్తున్నారు. అలాంటప్పుడు ఆఫ్రికన్లతో పోలిక ఎవరికైనా ఎందుకంత ఉలికిపాటుకు గురి చేయాలి? వలసలు, సాంకర్యాల క్రమంలో మనుషులు తమ ఒరిజినల్ లక్షణాలలో కొన్నింటిని నిలుపుకొన్నారు, కొన్నింటిని కోల్పోయారు. ఇందుకు అనుగుణంగా దక్షిణ భారతీయుల రంగు ఉత్తరాదివారితో తేడాగా ఉండటం సహజం. ఆ చర్మపు రంగును గురించి, 'వీరంతా ద్రవిడులు' అనే ఈసడింపులు తెలిసిన విషయమే. ఈ విధమైన భావనలు ఏవీ దేశానికి మంచివి కావు.

దక్షిణ భారతీయులు ఆఫ్రికన్లను పోలి ఉంటారంటూ శామ్ పిట్రోడా (ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్‌గా రాజీనామా చేశారు) చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం సాగుతున్నది. రాజకీయాలను పక్కన ఉంచి మానవ వికాస శాస్త్రాన్ని, మానవ వలసల కోణాలను పరిశీలిస్తే ఆ వ్యాఖ్యలలో తప్పేమిటో అర్థం కాదు. వానరాల నుంచి ఆధునిక మానవుని ఆవిర్భావం తొలుత ఆఫ్రికాలోనే జరిగిందనీ, అక్కడి నుంచి వారు భూగోళంలోని వివిధ ప్రాంతాలకు వలస పోయారనీ, అందులో ప్రస్తుత భారతదేశం కూడా ఒకటనీ శాస్త్రవేత్తలు అంగీకరిస్తున్నారు. ఈ సూత్రీకరణను ప్రపంచమంతా కూడా ఆమోదిస్తున్నది. మనకు మాత్రం సైన్సు కన్నా రాజకీయాలు ముఖ్యం గనుక పిట్రోడా మాటలపై భూమ్యాకాశాలను ఏకం చేసే హంగామాను సృష్టిస్తున్నాము.

ఇంతకూ పిట్రోడా అన్నదేమిటి? ఆయన దక్షిణ భారతీయులు ఆఫ్రికన్లను పోలి ఉంటారని మాత్రమే అనలేదు. దేశంలోని తూర్పు ప్రాంతాల వారు చైనీయులవలె, పశ్చిమ ప్రాంతాల వారు అరబ్బుల వలె, ఉత్తరాది వారు శ్వేతజాతీయులవలె ఉంటారని కూడా అన్నారు. ఈ పోలికలలో తక్కిన మూడింటిని వదలి, దక్షిణ భారతీయులు ఆఫ్రికన్ల వలె ఉంటారన్న మాట ఒక్కటే వివాదమైంది. వివాదమైంది అనటంకన్న వివాదంగా మార్చారనటం సరైనదవుతుంది. ఈ చర్చలోకి వెళ్లే ముందు ఒక విషయం గుర్తు చేసుకోవాలి. స్వయంగా బీజేపీకి చెందిన తరుణ్ విజయ్ అనే నాయకుడు, తను రాజ్యసభ సభ్యునిగా, 'పాంచజన్య' పత్రిక సంపాదకునిగా ఉండినపుడు, ''మనం (అనగా ఉత్తరాది వారం) దక్షిణాది వారితో కలిసి ఉండటం లేదా?'' అని వ్యాఖ్యానించారు. అనగా, తాము తెల్లగా ఉంటామని, ఉత్తమ స్థాయి వారమని, దక్షిణాది వారు నల్లగా ఉంటారని, అధమ స్థాయి వారని, అయినప్పటికీ తమది ఉదార స్వభావం గనుక అటువంటి వారితో కలిసి జీవిస్తున్నామని అర్థం.

వాస్తవానికి దక్షిణాది వారి చర్మపు రంగును గురించి, కనుముక్కుల తీరు గురించి, భాషా సంస్కృతుల గురించి, 'వీరంతా ద్రవిడులు' అనే పద్ధతిలో ఈసడింపులు చేయటం అందరికీ తెలిసిన విషయమే. ఎన్టీఆర్ రాక వరకు అందరూ కట్టగట్టి 'మద్రాసీ'లే. ఈ ధోరణికి బీజేపీ, సంఘ్ పరివార్ సైతం మినహాయింపు కాదన్నది ఇక్కడ గుర్తించవలసిన విషయం. ప్రస్తుత వివాద సందర్భంలోనూ ఈ సంగతి గుర్తించాలి. పిట్రోడా కాంగ్రెస్ నేత అయినందున, ఆయన మాటలను వివాదం చేస్తే తమకు రాజకీయంగా లాభిస్తుందనే సంకుచిత ఆలోచన తప్ప, ఇందులో బీజేపీ వివేకం ఏమీ కన్పించదు.

మనకు తెలిసి మానవ వికాస శాస్త్రం, ప్రపంచవ్యాప్తంగా వలసల చరిత్ర, ఇటీవలి సంవత్సరాలలో జరిగిన డీఎన్ఏ పరిశోధనలు చెప్తున్న విషయాలు కొన్నున్నాయి. ఇండియా, చైనా, ఉత్తర యూరప్‌లలో ప్రాథమిక స్థాయి మానవ జాతులు స్వల్ప స్థాయిలో రూపుదిద్దుకున్నప్పటికీ, ఆధునిక మానవుని ఆవిర్భావం తొలుత జరిగింది ఆఫ్రికాలోని తూర్పు భాగాన గల రిఫ్ట్ వ్యాలీలో. వేలాది సంవత్సరాల కాలంలో అటువంటి ఆవిర్భావం ఏ విధంగా జరిగిందో శాస్త్రీయమైన పురావస్తు అధ్యయనాలు చెప్పాయి. వాటిపై కెన్యా రాజధాని నైరోబీ, ఇథియోపియా రాజధాని అడ్డిస్ అబాబాలలోని జాతీయ మ్యూజియాలలో గొప్ప ప్రదర్శనలున్నాయి. ఈ రెండింటినీ నేను స్వయంగా చూడటమే గాక, రిఫ్ట్ వ్యాలీలోని కొంత భాగంలో ప్రయాణించాను. ఆధునిక మానవుని ఆవిర్భావం పరిస్థితి ఇది కాగా, ఆ ప్రాంతం నుంచి మానవులు రెండు లక్షల సంవత్సరాల క్రితం నుంచి మొదలుకొని ప్రపంచం నలువైపులా ఎట్లా వలస వెళ్లారో, ఆ విధంగా 70 వేల ఏళ్ల క్రితం ప్రస్తుతం మనం అంటున్న భారతదేశంలోకి ఏ విధంగా ప్రవేశించారో అనేక అధ్యయనాలున్నాయి.



అండమాన్ దీవుల్లోని అండమానీస్ తెగ ప్రజలు (ఫైల్ ఫొటో)

తర్వాత వేల సంవత్సరాలలో ప్రపంచమంతటా జరిగినట్లే ఇండియాలో కూడా లెక్కలేనన్ని జాతి సాంకర్యాలు జరిగాయి. పైన చెప్పుకున్నట్లు అప్పటికే ఇక్కడ స్వల్ప స్థాయిలో ప్రాథమిక మానవులు ఉండగా, తర్వాత కాలాలలో తూర్పు ఆసియా నుంచి మంగోలాయిడ్లు, మధ్య ఆసియాలోని కాస్పియన్ సముద్ర ప్రాంతం నుంచి ఆర్యులు, పశ్చిమాసియా నుంచి అరబ్బులు, పారశీకుల పూర్వీకులు ఇటువైపు వలసలు వస్తూ పోయారు. తిరిగి వీరందరి మధ్య సాంకర్యాలు, వలసలు వేలకు వేల సంవత్సరాల పాటు సాగాయి. దేశంలోని అన్ని ప్రాంతాల స్త్రీ, పురుషుల డీఎన్ఏలపై జరిగిన ఆధునిక శాస్త్ర పరిశోధనలు, పురావస్తు పరిశోధనలు తేల్చిన విషయాలివి. అయితే ఈ వలసలు, సాంకర్యాల క్రమంలో వేర్వేరు జాతులు, ప్రాంతాల మనుషులు తమ ఒరిజినల్ లక్షణాలలో కొన్నింటిని తరతరాలుగా నిలుపుకోవటం, కొన్నింటిని ఒక మేర కోల్పోవటం జరుగుతూ వస్తున్నదని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఉదాహరణకు అండమాన్, నికోబార్ ఆదిమవాసి తెగలు, దేశంలోని మారుమూల అడవులలో నివసించే ఆటవిక జాతులకు ఇతరులతో సాంకర్యం దాదాపు లేనందున, వారిలో ఇప్పటికీ ఆఫ్రికన్ డీఎన్ఏ యథాతథంగా కనిపిస్తుందంటారు. అటువంటి స్థితిలో ఆఫ్రికన్లతో పోలిక ఎవరికైనా ఎందుకంత ఉలికిపాటుకు, వ్యతిరేక భావనకు గురి చేయాలి?

దక్షిణాది ప్రజలు, ఈశాన్య భారత లేదా తూర్పు భారత వాసులు, పశ్చిమ, ఉత్తర ప్రాంతాల వారి రంగు తేడాలకు మూలాలు దీనంతటిలో ఉన్నాయి. దక్షిణ–ఉత్తర భారత భాషలు, సంస్కృతులు, దేవతలు, ఆలోచనా ధారల మధ్య, చివరకు రాజకీయాల మధ్య కనిపించే వ్యత్యాసాలకు గల మూలాలను శాస్త్రీయంగా శోధిస్తూ పోతే బోధపడేది ఇదే. ఆధునిక మానవుల ఆవిర్భావానికి, వారి వలసలకు, పరస్పర సాంకర్యాలకు లక్షలాది, వేలాది సంవత్సరాల చరిత్ర ఉంది. ఇందుకు ప్రపంచంలోని ఏ ప్రాంతంగానీ, భారతదేశంగానీ ఎంత మాత్రం మినహాయింపు కావు. పైన చెప్పుకొన్నట్లు, ఈ పరిణామ క్రమం ఒకవైపు అనంతంగా సాగుతూనే, మరొకవైపు అనేకులు తమ ఒరిజినల్ డీఎన్ఏలోని, ఒరిజినల్ లక్షణాలలోని కొన్ని భాగాలను అదేవిధంగా నిలుపుకొన్నారు. అట్లా ఎవరెంత నిలుపుకొన్నారు, అవి ఏ మేరకు నిలిచి ఉన్నాయనేది అనేక పరిస్థితులపై ఆధారపడి సాగుతూ వస్తున్నది.

ఇందుకు అనుగుణంగా దక్షిణ భారతీయుల రంగు కన్నా ఉత్తరాదివారు, పశ్చిమ, తూర్పువాసుల రంగు తేడాగా ఉండటం సహజం. కానీ దానినిబట్టి వివక్షలు ఏర్పడాలంటే, తక్కిన ముగ్గురిలోనూ ఆఫ్రికన్ డీఎన్ఏ ఉంది. వారి పూర్వీకులు సైతం ఆఫ్రికన్లే. అటువంటపుడు, ఇంకా ఒక మేర మిగిలి ఉన్న రంగును బట్టి తరుణ్ విజయ్ అనే పెద్దమనిషి గానీ, మరొకరుగానీ, తమవంటి పూర్వీకులే గల దక్షిణ భారత ప్రజలను చిన్నచూపు చూడటం విజ్ఞతగల పని అవుతుందా? ఇంతకూ పిట్రోడా ఆ మాటలన్నది ఎందుకో తెలియదు గానీ, మానవ వికాస శాస్త్రం దృష్టితో, ప్రపంచవ్యాప్త వలసల చరిత్ర దృష్టితో, డీఎన్ఏ పరిశోధనల దృష్టితో సరిగా ఇవే మాటలను ఇప్పటికి ఎందరో అన్నారు, రాశారు. ఎన్నికల సమయం గనుక ఇది అధికార పక్షానికి ఒక మంచి ఆయుధంగా మారింది.

ఈ సందర్భంలో మరొకటి గుర్తుకు వస్తున్నది. ఆర్యుల, ఉత్తరాది వారి ఆధిపత్యంగల పార్టీలు, ప్రభుత్వాలు ద్రవిడుల దక్షిణాదిని రాజకీయంగా జయించాలని, తమ ఆధిపత్యం కిందకు తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నాయని, నిరంతరం వివక్షకు గురి చేస్తున్నాయనే వాదనలు పెరియార్ రామస్వామి తర్వాత, హిందీ వ్యతిరేక, ఉత్తరాది వ్యతిరేక ఉద్యమాల తర్వాత ఇప్పటికీ ముందుకు వస్తుంటాయి. ఈ విధమైన భావనలు ఏవీ దేశానికి మంచివి కావు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వ్యాప్తి లేకనా?



గుప్తుల వంశానికి చెందిన కుమార గుప్తుడు నిర్మించిన అసలైన నలందా విశ్వవిద్యాలయాన్ని సందర్శించడం బాగుంది. దాని విస్తృతి, సంరక్షణ, విభ్రాంతి గొలిపే తీరు దృష్ట్యా చూస్తే ప్రపంచంలోనే అంతర్జాతీయ యాత్రికులు అత్యంత తక్కువగా సందర్శించే చారిత్రక ప్రదేశంగా ఇది నిలుస్తుంది.

– ఆండ్రూ ఫ్లెమ్మింగ్, బ్రిటన్ దౌత్యవేత్త

తగ్గినా నెగ్గుతారు!



బీజేపీలో పగుళ్లను గుర్తిస్తూ ప్రతిపక్షం సంబరపడుతుండొచ్చు గాక! కానీ సందేహం లేకుండా బీజేపీ, దాని మిత్రపక్షాలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయి. వాళ్లు దాని మీద ఏళ్లుగా పనిచేస్తున్నారు. వారి మార్కెటింగ్ వ్యూహం కచ్చితంగా ఉంది. 400 స్థానాలు రాకపోవచ్చు, కానీ ప్రభుత్వమైతే ఏర్పడుతుంది.

– అతుల్ ఖత్రీ, యూట్యూబర్

మతం మారిన గోడలు



హాజియా సోఫియా తర్వాత, టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ మరో ప్రాచీన ఆర్థోడాక్స్ చర్చిని మసీదుగా మార్చారు. చర్చి నుంచి మసీదుగా, అటుపై మ్యూజియంగా మారినదాన్ని మళ్లీ మసీదు చేశారు. ఇంకెక్కడైనా మసీదును ఇస్లామేతర ప్రార్థనాస్థలంగా మార్చితే ఎర్డోగాన్ కచ్చితంగా కోపోద్రిక్తులవుతారు.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

మనమే కాపాడుకోవాలి!



ఇజ్రాయెల్‌కు పంపాల్సిన ఆయుధాలను అమెరికా నిలిపి వుంచిందని వార్త. దాదాపుగా తన 51వ రాష్ట్రం లాంటి ఇజ్రాయెల్‌కే అమెరికా అలా చేయగలిగితే, అది ఇండియాకు ఏం చేయగలదో ఊహించండి. రక్షణ రంగంలో ఆత్మనిర్భరతకు మించిన ప్రత్యామ్నాయం లేదు.

– దివా జైన్, డెవలపర్

కావాలనే...



మనం భరించాల్సి వస్తున్న ఈ ఎండలు, వాతావరణ సంక్షోభం ఏదో ప్రమాదవశాత్తూ సంభవించినవి కాదు; అది ఉద్దేశపూర్వక రాజకీయ ఎంపిక.

– దిశా రవి, యాక్టివిస్ట్

ఆయనకు ప్రజలే దేవుళ్ళు

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

ప్రజాస్వామ్య యుగంలో కత్తి ఉన్నవాడిదే రాజ్యం కాదు. ప్రజాబలం ఉన్నవాడిదే రాజ్యం. ప్రజాబలం ఏ నాయకుడికైనా ఓటు ద్వారా లభిస్తుంది. ఓటరు తలచుకుంటే ఎవరినైనా గద్దెనెక్కించగలడు. కాని ఈ ఓటరును అయోమయంలో ముంచి కులమతాలను రెచ్చగొట్టి, సామాజిక అంతరాలను సృష్టించి, డబ్బు ప్రలోభాలు పెట్టి, అబద్ధాలను అనంత సంఖ్యలో ప్రచారం చేసి గెలుద్దామనుకునే చంద్రబాబు నాయుడు లాంటి నాయకులున్నారు. తానిదివరకు పధ్నాలుగేళ్ళు ముఖ్యమంత్రిగా ఉండి ప్రజలను ఏమాత్రం పట్టించుకోకుండా నేలవిడిచి సాము చేసినట్లు పాలన చేసిన చంద్రబాబు నాయుడు కాపీ కొట్టిన ఉచితాల పథకంతో, తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మరోసారి మభ్యపెట్టాలని చూస్తున్నారు.

చంద్రబాబుకు జగన్‌ను ఇష్టమున్నట్టు తిట్టడమే మ్యానిఫెస్టో. ఐదేళ్ళ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి యాభై ఏళ్ళ భరోసానిచ్చిన జగన్‌ను బదనాం చేయడమే బాబు బృందం పనిగా పెట్టుకుంది. చంద్రబాబు ఎన్ని ప్రయత్నాలు చేసినా గత ఐదేళ్ళలో జగన్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చేసిన మేలు, వాగ్దానాల అమలును ప్రజలు మరచి పోయేట్టు చేయలేకపోతున్నారు. ఇంగ్లిష్ మీడియం నాణ్యమైన చదువులు, ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి, నవరత్నాలు, రైతు భరోసా, రుణమాఫీ, వలంటీర్ వ్యవస్థ, లక్షలాది ఉద్యోగాల కల్పన, పారిశ్రామికాభివృద్ధి, సామాజిక అంతరాల తొలగింపుకై చేస్తున్న కృషి లాంటి వన్నీ జగన్‌ను ఎన్నటికీ ప్రజలు మరచిపోలేని విధంగా మార్చాయి. చంద్రబాబు 14 ఏళ్ళపాలనలో బాబు పేరును జ్ఞాపకం చేసుకోవడానికి వీలున్న ఒక్క పథకమూ లేనందువల్ల ఆయన ఎన్ని ఉచితాలు ప్రకటించినా అవి ఉత్తుత్తివే అని ప్రజలు భావిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాలను ఏలిన ఏ రాజకీయనాయకుడూ సంపాదించనంత ప్రజాదరణను, కీర్తి ప్రతిష్ఠలను జగన్ ఐదేళ్ళలో సంపాదించారు. ఆయనకున్న అసమాన పథక రచనా చాతుర్యం, ప్రజాస్వామ్యంలో పాలకుడు ఇలా ఉండాలన్న విషయంపై ఉన్న క్లారిటీలే అందుకు కారణం. మౌలిక మార్పులు తీసుకురావడంలో, ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే ఉదాహరణ ప్రాయంగా నిలబెట్టడంలో, సామాజిక న్యాయబాటను సువిశాలం చేయడంలో జగన్ తీసుకున్న చర్యల వల్ల ఈ విజయం సాధ్యమైంది.

మతాన్ని, కులాన్ని సెంటిమెంట్లను రెచ్చగొడుతూ ఓట్లు సంపాదించుకునే మతతత్వ పార్టీలు, సిద్ధాంత ప్రాతిపదిక అంటూ ఏదీ లేకుండా పార్టీలు నడిపే కప్పదాటు నాయకుల సమూహం ఎన్నికల వేళ జగన్‌కు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నాయి. కానీ ప్రజలు వీటిని పట్టించుకోవడం లేదు. జగన్‌కు ఆచరణశీలత ఉంది. ప్రజలను ప్రేమించే గుణముంది. ఆ ప్రజల కోసం ఏమైనా చేసి తీరాలన్న తపనుంది. తండ్రి రాజశేఖరరెడ్డి వారసత్వంగా వచ్చిన 'ప్రజలే దేవుళ్లు' అనే భావముంది. ఆ ప్రజలకు సేవ చేయాలన్న సేవా తత్పరత ఉంది. అందుకే ప్రజలంతా జగన్ వెంటున్నారు. అప్పుడు వైఎస్సార్‌ను హృదయానికి హత్తుకున్నట్టే ఇప్పుడు జగన్‌ను హత్తుకుంటున్నారు. జగన్ నడిపిస్తున్న వైఎస్సార్ సీపీని ఆంధ్రులు గెలిపించి తీరుతారు. బూటకపు ఉచితాల చంద్రబాబుకిది చివరి ఎన్నిక కావడం ఖాయమని అనేక సర్వేలు చెబుతున్నాయి.

వ్యాసకర్త ప్రముఖ కథారచయిత । 91829 18567

ఎంతకాలం మోసం చేయగలరు?

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీ, ఆర్ఎస్ఎస్ మీద చేసిన నిరాధారమైన అబద్ధాలపై లోతైన విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉంది. ఆయన చెప్పినవన్నీ అబద్ధాలే. వాటిని ప్రజల ముందు ఉంచాలి. లేకుంటే అవన్నీ నిజాలని నమ్మే ప్రమాదం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటే అని తప్పుడు ప్రచారం చేయటం, అలవి కాని తప్పుడు హామీలు ఇవ్వడం ద్వారా అసెంబ్లీ ఎన్నికలలో గెలిచారు. ఆ హామీలు ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల్లో కొత్త అబద్ధాలతో ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు.

ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతమే రిజర్వేషన్లు రద్దు చేయడం అని సొంత థియరీ చెప్పడం ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనం. ఎందుకంటే ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డా॥ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ సంఘ్ 'విజన్ అండ్ మిషన్'ను స్పష్టంగా చెప్పారు. 'జనతా జనార్దన' అనే భావనను ఆయన చెప్పారు. అనగా 'ప్రజలే దేవుడి అవతారం, ప్రజాసేవ చేయడం అంటే దైవ సేవ చేయటం' అని అర్థం. అటువంటి దైవిక పునాదుల మీద నిర్మితమైన ఆర్ఎస్ఎస్ ఎన్నో తరాలుగా నష్టపోయిన నిరుపేద ఎస్సీ, ఎస్టీ ప్రజలకు ఇచ్చిన, రాజ్యాంగ బద్ధంగా లభించిన రిజర్వేషన్లను రద్దు చేసే ప్రణాళికతో ఉందనడం దేశ ప్రజలను తప్పుదోవ పట్టించటమే అని చెప్పాలి. రాజకీయ పార్టీగా ఎదిగిన బీజేపీ నిరంతరం హిందూ సమాజంలోని అసమానతలను తొలగించి ఒక నూతన భారతాన్ని నిర్మించేందుకు కృషి చేస్తూ వస్తున్నది. అటువంటి బీజేపీ మీద రిజర్వేషన్లు రద్దు చేస్తారనే ఊహాజనితమైన నింద వేయడం ఆయన రాజకీయ దిగజారుడుతనాన్ని తెలియజేస్తుంది.

ముఖ్యమంత్రి సంఘ్, బీజేపీ నాయకులను అభాసుపాలు చేసేముందు సావర్కర్ హిందూ సమాజంలోని కుల రుగ్మతలకు వ్యతిరేకంగా అప్పట్లోనే నిర్వహించిన 'సహపంక్తి' భోజనాల వంటి కార్యక్రమాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అంతేకాక బీజేపీ సిద్ధాంతకర్త అయిన దీన్ దయాల్ ఉపాధ్యాయ్ 'అంత్యోదయ', 'ఏకాత్మ మానవతా వాదం' వంటి తాత్విక చింతనల గురించి అధ్యయనం చేసి మాట్లాడి ఉండాల్సింది. ప్రజాస్వామ్యంలో ఓట్లు పొందాలంటే ప్రజలను మెప్పించే విధానం ప్రజాసేవ మాత్రమే కానీ... రాజకీయ ఆరోపణలు, అబద్ధాలు కావని గుర్తుంచుకోవాలి.

రేవంత్ రెడ్డి మీద వచ్చిన ఫిర్యాదు, నమోదైన కేసు విషయాన్ని పరిశీలిస్తే ఆయన చేస్తున్న వితండవాదం ఏంటో ఇట్టే అర్థమవుతుంది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మాటల్ని వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా రూపొందించిన ఒక 'డీప్ ఫేక్' వీడియోకి సంబంధించి ఢిల్లీ పోలీసులు ఆయనకు నోటీస్ జారీచేశారు. అమిత్ షా చాలా స్పష్టంగా మతపరమైన రిజర్వేషన్లు తమ విధానం కాదనీ ఎస్సీ, ఎస్టీలకు దక్కాల్సిన న్యాయబద్ధమైన వాటాను ముస్లింలకు బదిలీ చేసే ప్రయత్నాలను బీజేపీ అడ్డుకుంటుందనే అర్థంలో మాట్లాడితే దాన్ని మార్చి అసలు ఎస్సీ, ఎస్టీలకు ఉన్న రిజర్వేషన్లను తీసివేస్తామన్న అర్థం వచ్చేలా ఫేక్ వీడియో తయారుచేసి ప్రచారం చేశారు.



రాజ్యాంగ బద్ధమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న రేవంత్ రాజ్యాంగ సమీక్ష కొరకు నియమించిన జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్‌ను రాజ్యాంగాన్ని మార్చడానికి వేశారని ఏమాత్రం అవగాహన లేకుండా మాట్లాడటం ఆయన విషయ పరిజ్ఞానానికి నిదర్శనం. రేవంత్ తూలనాడినట్టుగా బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం ఏనాడూ చేయలేదు. నిజానికి కాంగ్రెస్ పార్టీనే తరచూ రాజ్యాంగ సవరణలు చేసింది. ఒక్క ఇందిరా గాంధీ కాలంలోనే 42వ రాజ్యాంగ సవరణతో పాటు అనేకసార్లు రాజ్యాంగాన్ని సవరణల పేరుతో తన ఇష్టం వచ్చినట్టుగా మార్పు చేశారు. రాజ్యాంగ ప్రాథమిక స్వరూపాన్ని మార్చే ఏ హక్కూ పార్లమెంట్‌కు లేదని 'కేశవానంద భారతి' వంటి సుప్రీం కోర్టు తీర్పులు చెబుతుంటే... రేవంత్ రెడ్డి ఇలాంటి అనైతికమైన ఆరోపణలు చేయటం ఆయన స్థాయికి తగదు.

హిందూ మతం నుంచి వేరే మతానికి మారిన వారు కూడా రిజర్వేషన్లు అనుభవించడాన్ని కాంగ్రెస్ ఇంతకాలం చూస్తూ ఊరుకుంది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా మత మార్పిడి చేసుకున్న వాళ్ళకి మత పరమైన రిజర్వేషన్లు తీసివేస్తామని పేర్కొన్నారు తప్ప రిజర్వేషన్లను రద్దు చేస్తామని ఎక్కడా ప్రస్తావించలేదు. దీని మీద అబద్ధపు ప్రచారం చేసిందే కాకుండా ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త గురూజీ గోల్వాల్కర్ 2015 తర్వాత రిజర్వేషన్లను రద్దు చేయాలని రాశారని అతిపెద్ద అబద్ధం చెప్పారు రేవంత్. అబద్ధాలనే ప్రచారాస్త్రాలుగా చేసుకున్న రేవంత్ జాతీయ రాజకీయాలను తాత్కాలికంగా ఆకర్షించవచ్చేమో గానీ... అవి ఆయన్ను విశ్వసనీయత గల దీర్ఘకాలిక నేతగా మాత్రం నిలబెట్టలేవు.

– డా॥ దొంతగాని వీరబాబు, హెచ్‌సీయూలో రాజనీతి శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్,

చందనోత్సవం

ఎటు చూసినా సంపెంగలు, పనస ఫలాల పరిమళాలు విరజిమ్మే ప్రకృతి రమణీయతతో విరాజిల్లే శ్రీ వైష్ణవ క్షేత్రం సింహాచలం. నర, వరాహ, సింహ అవతారాల కలయికతో త్రిభంగి మూర్తిగా సాక్షాత్తు శ్రీ మహా విష్ణువే అప్పన్నగా వెలసిన దివ్యధామం సింహగిరి. నిత్యం చందన అలంకారంతో లింగాకృతిలో భక్తులను అనుగ్రహిస్తున్న స్వామి తన నిజ రూపంలో, అదీ సంవత్సరంలో కొన్ని గంటల పాటు దర్శనం ఇచ్చే పవిత్ర దినం అక్షయ తృతీయగా వ్యవహరించే వైశాఖ శుద్ధ తదియ.

సింహాచల చందనోత్సవానికి వారం రోజులు ముందు నుంచే ప్రత్యేక జప, హోమ, పూజలతో చందనం అరగదీసే ప్రక్రియ ప్రారంభిస్తారు. రంగరించిన చందనంలో 60 రకాల వన మూలికలు, సుగంధ ద్రవ్యాలు కలుపుతారు. అక్షయ తృతీయ వేకువ జామునే స్వామికి ప్రత్యేక ఆరాధన ముగిసిన పిమ్మట ఆలయ అర్చకులు తమ నాసికలకు వస్త్రం చుట్టుకుని బంగారు బోరిగలతో స్వామి మీద ఉన్న చందనాన్ని తొలగిస్తారు. అనంతరం గంగాజల ధారతో అభిషేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ రాత్రి వరకు నిజ రూపాన్ని లక్షలాది మంది భక్తులు దర్శించుకుంటారు. తిరిగి సాయంత్రం ఆరాధన అనంతరం చందనయాత్రలోనే అపురూపమైన ఘట్టం మొదలవుతుంది. అదే సహస్ర ఘటాభిషేకం. దేశం నలుమూలల నించి వచ్చిన శ్రీ వైష్ణవ స్వాములు సంప్రదాయంగా శ్రీ సూక్త, పురుష సూక్త, విష్ణుసహస్ర నామాలు పఠిస్తూ గంగాధర నుంచి ఘటాలతో తెచ్చిన జలాలతో స్వామికి సహస్ర ఘటాభిషేకం జరుగుతుంది. అనంతరం స్వామికి తొలి విడతగా మూడు మణుగుల చందన సమర్పణ చేస్తారు.

శ్రీ వరాహ లక్ష్మి నృసింహ స్వామి వారికి చందనాన్ని తొలి విడతగా అక్షయ తదియనాడు అనంతరం వైశాఖ, జేష్ఠ, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో మూడు విడతలుగా తొమ్మిది మణుగుల చందనాన్ని సమర్పిస్తారు. అంటే స్వామికి సుమారు 500 కిలోల చందనాన్ని సమర్పిస్తారు. ఎంతో వైభవంగా జరిగే ఈ చందన యాత్రను తిలకించేందుకు వేలాదిమంది భక్తులు వస్తారు. నారసింహ నామంతో సింహగిరులు ప్రతిధ్వనిస్తాయి.


– అద్దంకి శ్రీరామ కుమార్, ఆకాశవాణి విశ్రాంత వార్తా ప్రతినిధి

(నేడు సింహాచల అప్పన్న చందనోత్సవం)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.విదియ ఉ.8.44 వరకు, తదుపరి తదియ తె.4.45 వరకు (తెల్లవారితే శనివారం), **నక్షత్రం:** రోహిణి ప.12.34 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** సా.6.11 నుండి 7.44 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.05 నుండి 8.56 వరకు, తదుపరి ప.12.19 నుండి 1.12 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.27 నుండి 11.02 వరకు, అక్షయతృతీయ. ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.34, **సూర్యాస్తమయం:** 6.17.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+8 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 48
శుక్రవారం 10-5-2024



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

SIMULTANEOUSLY PRINTED AT WARANGAL | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

సాక్షి ఫ్యామిలీ IV
వరంగల్
శుక్రవారం ॥ 10-5-2024

ఫ్యాషన్

ఒక్క మార్కూ వదల్లేదు!

నూటికి నూరు శాతం అంకితం



చదువుల తల్లి సరస్వతే అయినా ఆడపిల్ల చదువుకు వెనుకా ముందు ఆలోచించేవారు ఇంకా ఉన్నారు. అలాంటి వారందరూ అంకితను చూసి ఆలోచన మార్చుకోవాలి. ఎందుకంటే కర్నాటక రైతు బిడ్డ అంకిత పదవ తరగతి ఫలితాల్లో 625కు 625 మార్కులు తెచ్చుకుంది. రాష్ట్రం మొత్తం మీద సెంట్ పర్సెంట్ వచ్చింది అంకితకే. ఇలాంటి అంకితలు ఎందరో ఉంటారు చదువులో ప్రోత్సహిస్తే.

మే 9 వ తేదీ.

ఆ ఫోన్ వచ్చేసరికి బసప్ప పొలంలో ఉన్నాడు.

అవతలి వైపు ఉన్నది స్కూల్ టీచరు.

'బసప్ప గారు మీ అమ్మాయికి పదవ తరగతిలో స్టేట్ ఫస్ట్ మార్కులు వచ్చాయి'

'ఓ.. ఎన్ని మార్కులు వచ్చాయి సార్?'

'ఎన్ని వచ్చాయి ఏంటి బసప్ప గారు. అంతకు మించి వేయలేక 625కు 625 వేశారు. అంత బాగా చదివింది మీ అమ్మాయి. ఇన్ని మార్కులు ఇంకెవరికీ రాలేదు'...

కర్నాటకలోని బాగల్‌కోట్‌కు దాదాపు గంట దూరంలో ఉండే చిన్న పల్లె వజ్రమట్టి. ఆ ఊరే బసప్పది. ఆరెకరాల రైతు. పెద్దమ్మాయి అంకిత. ఇంకా ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. వార్త తెలిశాక ఇంటికి ఆఘమేఘాల మీద చేరుకున్నాడు. మరి కాసేపటిలో ఊరు ఊరంతా ఆ ఇంటి ముందే ఉంది. సందడి చేసింది. కోలాహలం సృష్టించింది. పులకరించింది. మరి ఒక చిన్న పల్లెటూరి నుంచి అంత బాగా చదివితే ఆ అమ్మాయిని ఆశీర్వదించకుండా ఎలా? అంకితను చూసి ప్రతి ఒక్కరూ మెటికలువిరవడమే.



● తల్లిదండ్రులు గీత, బసప్పలతో అంకిత

హాస్టల్‌లో ఉండి

అంకిత తన ఊరికి నలభై నిమిషాల దూరంలో ఉన్న ముధోల్‌లోని ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుకుంది. స్కూల్ హాస్టల్‌లో ఉండి చదువుకుంటూనే సెలవుల్లో ఇంటికి వచ్చేది. 'నేను సెల్‌ఫోన్ వాడను. ఏ రోజు పాఠాలు ఆ రోజు చదువుకుంటాను. డిజిటల్ లైబ్రరీలో అదనపు మెటీరియల్ చదివాను. ఉదయం ఐదుకు లేస్తాను. మళ్లీ రాత్రి చదువుతూనే నిద్రపోతాను. ఇంట్లో ఉంటే ఇంటి పనులు ఏవో ఒకటి చేయాల్సి వస్తుంది. కాని హాస్టల్‌లో ఉంటే చదువు తప్ప వేరే పనేముంది. నా పాఠాలు అయ్యాక ఆడుకోవడం కూడా నేను మానలేదు. మా స్కూల్ టీచర్లు ముందు నుంచి నాకు మంచి మార్కులు వస్తాయని ఊహించారు. వారు నాకు అన్ని విధాల సపోర్ట్ చేస్తూ వచ్చారు. నాకు సెంట్ పర్సెంట్ వచ్చినందుకు ఆనందమే. కాని నా కంటే మా అమ్మానాన్నలు, స్కూల్ టీచర్లు ఎక్కువ సంతోషపడటం నాకు ఎక్కువ ఆనందాన్ని ఇచ్చింది. మా స్కూల్‌లో మంచి క్రమశిక్షణ ఉంటుంది. అందువల్లే నేను బాగా చదివాను' అని చెప్పింది అంకిత.

ఐ.ఏ.ఎస్. కావాలని

'మా అమ్మాయి బాగా చదువుతుందనుకున్నాము గాని ఇంత బాగా చదువుతుందని అనుకోలేదు. మేము ఇక ఆమె ఎంత చదవాలంటే అంత చదివిస్తాము. ఏది చదవాలన్నా ఎంత కష్టమైనా చదివిస్తాము' అన్నారు బసప్ప. అతని భార్య గీత. భర్తతో పాటు పొలానికి వెళ్లి పని చేసే గీత కూతురిని చూసి మురిసిపోతోంది. 'నేను ఇంటర్‌లో సైన్స్ చదివి ఇంజనీరింగ్ చేయాలనుకుంటున్నాను. ఆ తర్వాత ఐ.ఏ.ఎస్. చేస్తాను' అంది అంకిత.

ముఖ్యమంత్రి ప్రశంస

అంకితకు వచ్చిన మార్కుల గురించి విని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అభినందనలు తెలియచేశారు. ఇంకా బాగల్‌కోట్ ప్రభుత్వ అధికారులు ప్రశంసలు తెలియచేశారు. ఇక కర్నాటక డెప్యూటీ చీఫ్ మినిస్టర్ డి.కె.శివకుమార్ తానే స్వయంగా ఇంటికి వచ్చి అభినందిస్తానని కబురు పంపారు. అంకిత విజయం బాగా చదివే అమ్మాయిలందరికీ అంకితం.




















వేసవిలో కాటన్ డ్రెస్సుల ప్రాముఖ్యత గురించి తెలిసిందే. అలాగే, ఈ సీజన్‌కి టెక్స్‌టైల్ జ్యువెలరీ అంతే స్పెషల్‌గా ఉంటుంది. ఎంచుకునే ఫ్యాబ్రిక్ ఏదైనా చేతితో రూపొందించే ఈ జ్యువెలరీ కొనుగోలు ఖర్చూ తక్కువే. అలాగే, ఎవరికి వారు నచ్చినట్టు ఇంట్లోనూ తయారుచేసుకోవచ్చు. యువతను ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంచే ఈ స్పెషల్ జ్యువెలరీ అంతే తాజాదనపు అనుభూతిని సొంతం చేస్తుంది.

సీజనల్ స్పెషల్



ప్రకృతికి దగ్గరగా!

పువ్వులంటేనే ప్రకృతి తెలియపరిచే ప్రేమ భాష. డిజైనర్ స్టూడియోలలో వాడగా ఉపయోగించిన మెటీరియల్‌తో అందమైన పూలను తయారుచేయవచ్చు. వాటిని పూసలు, జరీ దారాలతో ఆభరణాలుగా మార్చవచ్చు. ఈ పువ్వుల ఆభరణాలు దుస్తుల అందాన్ని మరింతగా పెంచుతాయి.

ఫ్యాబ్రిక్ ఎంపిక

పాదం నుంచి తల వరకు ప్రతి ఆభరణాన్ని వస్త్రాలంకరణతో మెప్పించవచ్చు. చందేరీ, సిల్క్, నెటెడ్, కాటన్ వంటి ఏ మెటీరియల్ అయినా ఈ ఆభరణాల తయారీలో ఉపయోగించవచ్చు.



బన్ స్టిక్

కాటన్ దారాలు, క్లాత్‌తో తయారుచేసిన పువ్వులను ఉపయోగించి చేసిన బన్ క్లిప్స్ వేసవి సీజన్‌కి ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.

కంఠాభరణాలు

గార్మెంట్స్, బీడ్స్, జరీ లేదా కాటన్ దారాలను ఉపయోగించి చేసిన నెక్ పీస్‌లు సంప్రదాయ చీరల మీదకే కాదు వెస్ట్రన్ డ్రెస్సుల మీదకూ ప్రత్యేక హంగుగా నిలుస్తున్నాయి.

ఎంపిక చేసుకున్న ఫ్యాబ్రిక్‌కి కాంబినేషన్‌గా సిల్వర్ లేదా ఇతర లోహాలతో తయారైన మువ్వలు, గవ్వలు, జూకాలను జత చేయవచ్చు. దీని వల్ల ఈ జ్యువెలరీకి మరిన్ని హంగులు అమరుతాయి.

హెయిర్ కేర్

చుండ్రు వదలాలంటే...



● రెండు టీ స్పూన్‌ల నిమ్మరసాన్ని తీసుకుని ఒక టీస్పూన్ రసాన్ని తలకు (జుట్టు కుదుళ్లకు) పట్టించి పది నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. మరొక టీ స్పూన్ రసంలో కప్పు నీటిని కలిపి తల స్నానం పూర్తయిన తర్వాత తల మీద (స్కాల్ప్‌కు పట్టేలా) పోసుకోవాలి.

● వారం పాటు తలకు ఆలివ్ ఆయిల్ రాస్తే చుండ్రు వదులుతుంది. రోజూ తలస్నానం చేసే వాళ్లు రాత్రి పడుకునే ముందు ఆలివ్ ఆయిల్ పెట్టి ఉదయం తలస్నానం చేయవచ్చు.

● రెండు టేబుల్ స్పూన్‌ల కొబ్బరి నూనెలో అంతే మోతాదు నిమ్మరసం కలిపి తలకు పట్టించి పది నిమిషాల సేపు మర్దన చేయాలి. మర్దన చేసిన తర్వాత ఇరవై నిమిషాలకు మామూలు షాంపూ లేదా కుంకుడుకాయ రసంతో తలస్నానం చేయాలి.

● టేబుల్ స్పూన్ మెంతులను రాత్రి నానబెట్టి ఉదయం మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసి అందులో నిమ్మరసం (ఒక కాయ) కలిపి తలకు పట్టించాలి. అరగంట తర్వాత తలస్నానం చేయాలి. తలకు మెంతుల పేస్ట్ పెట్టినప్పుడు కొద్దిగా తేమగా ఉండగానే తలస్నానం చేయాలి. పూర్తిగా ఎండిపోయే వరకు ఉంచితే జుట్టుకు పట్టేసిన మెంతుల పేస్టును వదిలించడం కష్టం.

● కప్పు పుల్లటి పెరుగులో టీ స్పూన్ నిమ్మరసం కలిపి తలకు పట్టించాలి. ఆరిన తర్వాత తలస్నానం చేయాలి.

● చుండ్రును వదిలించడంలో వేపాకు కూడా బాగా పని చేస్తుంది. వేపనూనె తలకు పట్టించి పది నిమిషాల సేపు మర్దన చేయాలి. ఆ తర్వాత తలస్నానం చేయాలి. వేప నూనె లేకపోతే వేపాకు రసం పట్టించి మర్దన చేయవచ్చు.

బ్యూటిప్స్

మృదువైన హస్తాల కోసం...

- పులిసిన పెరుగుపైన ఉండే మీగడ తీసుకుని చేతులకి మసాజ్ చేస్తూ ఉంటే చేతులు మృదువుగా ఉంటాయి. పెట్రోలియమ్ జెల్లీతో కూడా మసాజ్ చేసుకోవచ్చు.
- ఆలివ్ ఆయిల్ ఒక చెంచా, నిమ్మరసం ఒక చెంచా, గ్లిజరిన్ ఒక చెంచా, గోధుమరవ్వ రెండు చెంచాలు, పాలు ఒక చెంచా కలిపి చేతులకి రాసుకుని గంట తర్వాత వేడి నీటితో శుభ్రంగా కడుక్కోవాలి.



- స్పూను దానిమ్మరసం, స్పూను టొమోటో గుజ్జు కలిపి దానిలో కొన్ని గ్లిజరిన్ చుక్కలు కలిపి చేతులకి పట్టించి ఒక గంట అయిన తర్వాత కడుక్కుంటే చేతులు చక్కగా మెరుస్తాయి.
- రెండు స్పూన్ల దానిమ్మరసంలో స్పూను పంచదార కలిపి చక్కెర కరిగిన తర్వాత చేతులకి పట్టించి నెమ్మదిగా మసాజ్ చేస్తే చేతులు నున్నగా ఉంటాయి.
- చెంచా బాదం పొడిలో తగినన్ని పాలు కలిపి పేస్ట్ చేసుకొని చేతులకి రాసుకొని పావుగంట తర్వాత కడుక్కోవాలి.
- నారింజ రసం రెండు చెంచాలు, తేనె రెండు చెంచాలు కలిపి చేతులకి రాసుకొని ఇరవై నిమిషాల తర్వాత వేడి నీటితో కడుక్కోవాలి.
- రెండు చెంచాలు గ్లిజరిన్, రెండున్నర చెంచాలు రోజ్ వాటర్ కలిపి చేతులకి మసాజ్ చేస్తే చేతులు మృదువుగా ఉంటాయి.
- రాత్రి పడుకోబోయే ముందు చేతులకి బేబీ ఆయిల్ పూసి మృదువుగా మసాజ్ చేస్తే చేతులు కోమలంగా ఉంటాయి.

వంటిల్లు

సిప్ సిప్పులోనూ... అదే రుచి చల్లదనం!

ఈ కాలంలో ఏమి తిన్నా... చల్లగా తినాలని ఉంటుంది. సీజనల్ ఫ్రూట్స్ అన్నింటినీ రుచి చూడాలనీ ఉంటుంది. ఆరోగ్యాన్నిచ్చే పండ్లు పాలతో చల్లని డ్రింక్స్ సిప్ చేద్దాం.



థండయ్ కుల్ఫీ



కావలసినవి: వెన్న తీయని పాలు – 2 కప్పులు
కోవా– 100 గ్రాములు ; కండెన్స్‌డ్ మిల్క్ – కప్పు; పాల పొడి– పావు కప్పు ; బాదం – 10 ; గసగసాలు – టేబుల్ స్పూన్ ; మిరియాలు – 5 ; యాలకులు – 2 ; సోంపు – టీ స్పూన్.

తయారీ: ● బాదం పప్పులను నానబెట్టి తొక్క వలిచి పలుకుగా గ్రైండ్ చేయాలి ● గసగసాలను పది నిమిషాల సేపు నీటిలో నానబెట్టి గ్రైండ్ చేయాలి. అవి ఒక మోస్తరుగా మెదిగిన తర్వాత అందులోనే మిరియాలు, యాలకులు, సోంపు వేసి అవి కూడా మెత్తగా మెదిగే వరకు గ్రైండ్ చేయాలి ● పాలను ఒక వెడల్పాటి పాత్రలో పోసి మరిగించాలి. కాగిన పాలలో కోవా, కండెన్స్‌డ్ మిల్క్, పాలపొడి వేసి కలిపి సన్న మంట మీద మరిగించాలి. ఇవి మరిగినంత సేపూ అడుగుపట్టకుండా గరిటెతో అడుగు వరకు కలుపుతూ ఉండాలి. ఈ మిశ్రమం చిక్కబడిన తర్వాత అందులో ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న గసగసాల మిశ్రమాన్ని, బాదం పలుకులను వేసి కలుపుతూ ఐదు నిమిషాల సేపు మరగనిచ్చి దించేయాలి. చల్లారిన తర్వాత మిశ్రమాన్ని కుల్ఫీ మౌల్డ్‌లో పోసి ఫ్రీజర్‌లో పెట్టాలి. సెట్ అవడానికి 8 గంటలు పడుతుంది. డ్రింక్‌గా తాగాలంటే గంట చాలు.

వాటర్ మెలన్ గోలా

కావలసినవి: పుచ్చకాయ – ఒకటి (మీడియం సైజు); చక్కెర– టేబుల్ స్పూన్ ; నిమ్మకాయ – 1 (రసం తీసుకోవాలి) ; ఉప్పు – చిటికెడు ; చాట్ మసాలా – చిటికెడు ; ఐస్ క్యూబ్‌లు – 4.

తయారీ: ● పుచ్చకాయ ముక్కల్లో చక్కెర, ఉప్పు, నిమ్మరసం, చాట్ మసాలా, ఐస్ క్యూబ్‌లు వేసి మిక్సీలో బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని నేరుగా గ్లాసులో పోసుకుని తాగవచ్చు లేదా ఐస్ క్యాండీగా కావాలంటే మౌల్డ్‌లో పోసి ఎనిమిది గంటల పాటు ఫ్రీజర్‌లో పెట్టాలి. ఫ్రీజర్‌లో నుంచి తీసిన తర్వాత మౌల్డ్ నుంచి ఐస్ క్యాండీని వేరు చేసి పిల్లలకివ్వడమే. క్యాండీ మధ్యలో విరిగిపోకుండా సులువుగా బయటకు రావాలంటే మౌల్డ్‌ను పది సెకన్లపాటు గోరువెచ్చటి నీటిలో పెట్టాలి.



ఆమ్ర శ్రీఖండ్

కావలసినవి: చిక్కటి పెరుగు – 3 కప్పులు ; చక్కెర – ఒకటిన్నర కప్పులు ; మామిడి పండ్లు – 2 (పెద్దవి) ; యాలకుల పొడి – పావు టీ స్పూన్ ; కుంకుమ పువ్వు – చిటికెడు ; బాదం పప్పు – పది (పలుకులు చేయాలి).

తయారీ: ● మామిడి పండ్ల తొక్క తీసి ముక్కలు చేయాలి. మిక్సీ జార్‌లో మామిడి ముక్కలు, పెరుగు, యాలకుల పొడి, కుంకుమ పువ్వు, చక్కెర వేసి మెత్తగా అయ్యే వరకు బ్లెండ్ చేయాలి ● ఈ మిశ్రమాన్ని రెండు గంటల పాటు ఫ్రిజ్‌లో పెట్టాలి ● ఫ్రిజ్‌లో నుంచి తీసి కప్పులో లేదా గ్లాసులో పోసి బాదం పలుకులతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి. పిల్లలు దీనిని పూరీ, చపాతీల్లోకి కూడా ఇష్టపడతారు.

భాపా ఆమ్ దోయి



కావలసినవి: చిక్కటి పెరుగు – ఒకటిన్నర కప్పులు ; కండెన్స్‌డ్ మిల్క్ – 6 టేబుల్ స్పూన్‌లు ; క్రీమ్ – ఒకటిన్నర కప్పు ; మామిడి పండు గుజ్జు – అర కప్పు; యాలకుల పొడి – పావు టీ స్పూన్.

తయారీ: ● వీటన్నింటినీ ఒక పాత్రలో వేసి సమంగా కలిసే వరకు బాగా చిలకాలి. ఈ మిశ్రమాన్ని మట్టి పాత్రలో పోసి అల్యూమినియం ఫాయిల్‌తో కవర్ చేయాలి ● ప్రెషర్ కుక్కర్‌లో స్టాండ్ పెట్టి నీరు పోసి ఐదు నిమిషాల సేపు వేడి చేయాలి. నీరు మరిగి ఆవిరి రావడం మొదలైన తర్వాత మట్టి పాత్రను జాగ్రత్తగా స్టాండ్ మీద పెట్టి కుక్కర్ మూత పెట్టి స్టవ్ ఆపేయాలి ● అర గంట తర్వాత తీసి చల్లారనిచ్చి ఫ్రిజ్‌లో రెండు గంటల సేపు పెడితే ఆమ్ దోయీ రెడీ.

సాక్షి
ములుగు
శుక్రవారం । 10 । మే । 2024



కార్పొరేట్‌కు బినామీ

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్‌కు బినామీగా మారిందని ఎంసీపీఐ (యూ)రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి విమర్శించారు. - 2లో▸



కాంగ్రెస్ గెలిస్తే అవినీతి పాలన

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే అవినీతి పాలన సాగుతుందని రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ అన్నారు. అరూరి రమేశ్‌కు మద్దతుగా ప్రచార సభలో మాట్లాడారు. - 2లో▸

గరిష్టం/కనిష్టం
39°/28°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రం పరిశీలన



వాజేడు: మండల పరిధిలోని కొంగాల పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఏటూరునాగారం ఏఎస్పీ గితే మహేష్ బాబా సాహెబ్, వెంకటాపురం(కె) సీఐ బందారి కుమార్, వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావులతో కలిసి పరిశీలించారు. భద్రతా పరంగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానం



ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రానికి చెందిన ట్రెండ్ యూత్ అధ్వర్యంలో నిర్వహించిన ముత్యాలమ్మ కప్ ఎంపీఎల్ -2 జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో బ్లూ వారియర్స్ టీం ప్రథమ స్థానంలో నిలవగా, ఇందిరానగర్ జట్టు రెండో స్థానం, తాడ్వాయి ఫ్రెండ్ యూత్ టీం మూడోస్థానం, వాజేడు టీం నాల్గో స్థానంలో నిలిచింది. విజేతలకు మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, ట్రెండ్ యూత్ సభ్యులు షీల్డ్‌లు, నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో దాతలు పైడాకుల అశోక్, కుంజ సూర్యం, శానికొమ్మ కార్తీక్‌రెడ్డి, కుడుముల బక్కయ్య, చందా రామ్, ప్రసాద్, ట్రెండ్ యూత్ అధ్యక్షులు మోకాళ్ల బాలాజీ, వెంకటేష్, శ్రీను, వట్టం అజయ్, బంగారి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2,15,100 నగదు స్వాధీనం



వాజేడు: మండల పరిధిలోని ధర్మవరం సమీపంలో ఎలక్షన్ కమిషన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి చంద్రశేఖర్ తన సిబ్బందితో గురువారం వాహన తనిఖీలను నిర్వహించారు. ఈ సమయంలో ఛత్తీస్‌గఢ్ వైపు నుంచి వస్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా రూ.2,15,100 నగదు బయటపడడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నగదు తరలింపునకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని అనంతరం ఆ నగదును పేరూరు ఎస్సై రమేష్‌కు అప్పగించినట్లు వెల్లడించారు.

మరమ్మతు పనులు పూర్తిచేయాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: ఈ నెలాఖరుకల్లా పాఠశాలల్లోని మరమ్మతు పనులు పూర్తి చేయాలని డీఎంహెచ్ఓ, మండల స్పెషలాఫీసర్ అల్లెం అప్పయ్య అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలలో చేస్తున్న మరమ్మతు పనులపై గురువారం ఎంపీడీఓ సుమనవాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో 23 పాఠశాలలను గుర్తించి వాటిలో ఐదు రకాల మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించామన్నారు. పనుల పురోగతిపై ఆరా తీయగా 15 పాఠశాలల్లో దాదాపు పనులు పూర్తి దశకు చేరుకున్నాయన్నారు. మిగితా పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వీవోలు, హెచ్ఎంలకు సూచించినట్లు తెలిపారు. కలెక్టర్ మరమ్మతుల పనులకు 25శాతం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రతీ పాఠశాలకు చెక్కుల రూపంలో హెచ్ఎంలకు అందించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎంఈఓ సాంబయ్య, పీజీహెచ్ఎం రేగ కేశవరావు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

స్టాండ్ లైటింగ్ జిగేల్



కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్ క్యాంపస్ ఆవరణలో ఏర్పాటు చేసిన కలర్ ఫుల్ లైటింగ్ జిగేల్ జిగేల్‌మంటూ ఆకట్టుకుంటోంది. ఇనుప గద్దె లోనుంచి ఒక పోల్ మాదిరిగా రూపొందించిన లైటింగ్‌లో రెడ్, ఆరెంజ్ కలర్‌లలో వెలుగుతోంది. నిట్‌లోని నెస్‌కెఫే ఎదురుగా, హెలికాప్టర్ పక్కన, కలామ్ గెస్ట్ హౌజ్ ఎదుట మొత్తంగా మూడు ప్రాంతాల్లో పోల్, స్టాండ్ లైటింగ్‌లను ఏర్పాటు చేశారు. ఆకర్షణ కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నాయకుల గుర్రు!

మూడు ప్రధాన పార్టీల్లో ముసలం

- నాయకుల మధ్య అంతర్గత విభేదాలు
- నామమాత్రంగా ఎన్నికల ప్రచారం
- పార్టీల అధిష్టానానికి ఫిర్యాదులు
- అధినాయకత్వం నుంచి హెచ్చరికలు



సాక్షి, మహబూబాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. ఒకరిని మించి మరొకరు వినూత్నంగా.. విభిన్న వేదికల ద్వారా ప్రచారం చేస్తూ ఓట్లు కొల్లగొట్టడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇదిలా ఉండగా మూడు ప్రధాన పార్టీల్లోని పలువురు నాయకులు గుర్రుగా ఉండడం.. కొందరు ఎన్నికలను పట్టించుకోవడం లేదని.. మరికొందరు పైకి ప్రచారం చేస్తూ అంతర్గత విబేధాలతో పార్టీకి నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తున్నారని ఆయా పార్టీల అభ్యర్థులు అధిష్టానానికి ఫిర్యాదులు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. దీంతో రాష్ట్ర నాయకులు రంగంలోకి దిగి బుజ్జగించే పనిలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

కాంగ్రెస్‌లో కర్రూ..బుర్రూ..

ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్లమెంట్ ఎన్నికల్లో ఉత్సాహం చూపడం లేదని ప్రచారం. ఇందుకు నిదర్శనం సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన బహిరంగ సభకు ఆశించిన స్థాయిలో జనం రాకపోవడం. ప్రధానంగా మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు నియోజకవర్గాల పరిధిలోని నాయకులు అభ్యర్థి బలరాంనాయక్‌కు పూర్తిస్థాయిలో సహకరించి, పనిచేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో 50వేలకు పైగా మెజార్టీ వచ్చిన చోట.. కాంగ్రెస్ ఓట్లకు గండిపడుతుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని గమనించిన అభ్యర్థి బలరాంనాయక్ కేంద్ర, రాష్ట్ర పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించిన నేతలు జిల్లా నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అదేవిధంగా కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ కూడా జిల్లా నాయకులతో చర్చించి పార్టీని గెలిపించాలని, మెజార్టీ తగ్గకూడదనే హెచ్చరికలు కూడా జారీ చేసినట్లు తెలిసింది. అయితే మొదటి నుంచి వర్గపోరు ఉన్న కాంగ్రెస్‌లో నాయకులు ఏ మేరకు కలిసి పనిచేస్తారో.. ఏ మేరకు మెజార్టీ వస్తుందో అనేది చర్చ.

బీఆర్ఎస్‌లో అంతర్గత వైరం..

వర్గపోరుకు నిలయంగా మానుకోట బీఆర్ఎస్ పార్టీకి పేరుంది. శాసనసభ ఎన్నికల్లో ఎవరికి వారు యమునా తీరు అన్న చందంగా వ్యవహరించడంతో ఘోర పరాజయం పాలయ్యారు. అయితే ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకున్నట్లు ఆ పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపుకోసం మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, హరిప్రియ ప్రచారం చేస్తున్నారు. మహబూబాబాద్‌లో నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్ షో సక్సెస్ కావడంతో మరింత ఉత్సాహంతో ప్రచారం చేస్తున్నారు. అయితే ఈ ప్రచారంలో కూడా ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ గొడవ పెట్టుకోవడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇదిలా ఉండగా కొందరు నాయకులు పైకి ప్రచారం చేస్తున్నట్లు కనిపిస్తున్నారే తప్ప.. పూర్తి స్థాయిలో ప్రచారం చేయడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

కలిసిరాని కమలనాథులు

భారత ప్రధాని నరేంద్రమోదీ చరిష్మాను నమ్ముకొని బరిలో దిగిన భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్‌తో పనిచేసేందుకు కమలనాథులు కలిసి రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పార్లమెంట్ సీటుకోసం జిల్లాలోని పదుల సంఖ్యలో నాయకులు పోటీ పడ్డారు. చివరకు బీఆర్ఎస్ నుంచి వచ్చిన సీతారాంనాయక్‌కు టికెట్ ఇవ్వడంతో పార్టీలోని కొందరు సీనియర్ నాయకులు నిరుత్సాహంతో ఉన్నారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అదేవిధంగా అసెంబ్లీ ఎన్నిలక వరకు అంతా తానై పార్టీని నడిపించిన జాటోత్ హుస్సేన్ నాయక్ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. దీంతో ఆయన ఢిల్లీకే పరిమితమయ్యారు. అదేవిధంగా పార్టీ జిల్లా నూతన కమిటీ ఏర్పాటు తర్వాత పాత, కొత్త కమిటీలు అన్న విధంగా రెండు వర్గాలుగా విడిపోయారు. ఈ విషయంపై పలుమార్లు స్టేజీల మీదకూడా పంచాయితీలు బయట పడ్డాయి. అదేవిధంగా సీతారాంనాయక్ పార్టీలోని సీనియర్ నాయకులను కలుపుకొని వెళ్లడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. తాను పార్టీలోకి వచ్చిన తర్వాత పార్టీలోని ఉన్న అంతర్గత విబేధాలు, ప్రచారంలో పలువురు కలిసి రాకపోవడం వంటి అంశాలను సీతారాంనాయక్ పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇలా ప్రధాన పార్టీల్లో అంతర్గత కుమ్ములాటలు, వైరాలు, అలక సీనులు ఎటు దారితీస్తాయో.. పోలింగ్ ముందు ఏ మార్పులు జరుగుతాయో.. చివరికి విజయం ఎవరిని వరిస్తుందో అనేది జిల్లాలో చర్చగా మారింది.

సెక్టార్ అధికారుల పాత్ర కీలకం

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమైందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ మేరకు పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించనున్న సెక్టార్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలకు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కలెక్టర్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రా, అదనపు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి హాజరై మాట్లాడారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని డీఆర్‌సీ కేంద్రాలలో ఎలాంటి సమస్యలు రాకుండా డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సాఫీగా జరిగేలా చూసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల ముందు కనీసం మూడుసార్లు పోలింగ్ కేంద్రానికి వెళ్లి మౌలిక సదుపాయాలను పరిశీలించాలన్నారు. తమ తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్‌లో వెబ్ కాస్టింగ్, పోలింగ్ స్టేషన్ నంబర్, వీల్‌చైర్లు, ఫర్నీచర్, టాయిలెట్స్ సరిగా ఉన్నాయా లేదా చూసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అధికారులు, సిబ్బందికి వసతి, భోజన సౌకర్యం బాధ్యత మండల అధికారులదేనని తెలిపారు. పోలింగ్ స్టేషన్‌కు సుమారు 100 మీటర్ల పరిధిలో రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, సామగ్రి ఉండకుండా చూసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ నుంచి బందోబస్తు మధ్య ఈవీఎం, వీవీప్యాట్‌లను సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ 2గంటలకు ఒకసారి ఓటర్ల నమోదు శాతం నివేదికను అందించాలన్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చిత్రామిశ్రా మాట్లాడుతూ పోలింగ్ టీం ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూసుకోవాలన్నారు. పోల్ మెటీరియల్‌ను కేవలం ప్రిసైడింగ్ అధికారికి మాత్రమే అందజేయాలని సూచించారు. పోలింగ్‌కు ఒకరోజు ముందు సిబ్బంది, అధికారులు కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. వేసవి కాలాన్ని పరిగణలోకి తీసుకొని తగిన సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి ఎండీ సిరాజ్ ఉర్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి నేడు చివరి తేదీ

పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి నేడు(శుక్రవారం) చివరి తేదీ అని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ తీసుకున్న వారంతా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. 13న పోలింగ్ రోజున ఓటు వేయడానికి వీలు ఉండదని తెలిపారు. జిల్లాలో 2,364 మందికి పోస్టల్ బ్యాలెట్ జారీ చేశామని, గురువారం వరకు 1,910 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.

సీఎంపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికుల సీఎంపీఎఫ్‌ను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేశామని, కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరి పంచౌరి ఆదేశించారు. ఏరియాలోని జీఎం కార్యాలయంలో గురువారం త్రైమాసిక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్మికులకు పదవీ విరమణ రోజునే సీ కెరీర్ ద్వారా సీఎంపీఎఫ్, పెన్షన్ సెటిల్‌మెంట్ చేసి ఖాతాలో జమయ్యే విధంగా కృషి చేయాలన్నారు. తప్పులు దొర్లిన వాటిని సవరించాలని సూచించారు. ప్రత్యేక వెబ్‌పోర్టల్‌ను ఉద్యోగులందరికీ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పీఎఫ్ దరఖాస్తులను నింపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సమావేశంలో అధికారులు వెంకటరామిరెడ్డి, తుకారం, సీతారామరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రేగ కాంతారావు

వెంకటాపురం(కె)/వాజేడు: బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పార్టీ అధ్యక్షులు రేగ కాంతారావు అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవితను ఎంపీగా గెలిపించాలని గురువారం ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేని హామీలను ప్రజలకిచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా ఎన్నికల హామీలను పట్టించుకోవటం లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ 24గంటల ఉచిత కరెంటు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. రైతులు పండించిన పంట ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దవుతున్న పట్టించుకునే వారే లేకుండా పోయారని ఎద్దేవా చేశారు. అనంతరం వాజేడు మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో సకాలంలో రైతుబంధు, దళితులకు దళితబంధు, మిషన్ భగీరథ నీరు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, రుణమాఫీ లాంటి అనేక సంక్షేమ పథకాలు అందించామన్నారు. నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుడవర్తి నర్సింహామూర్తి, వెంకటాపురం(కె) మండల పార్టీ అధ్యక్షులు గంపా రాంబాబు, ఎంపీపీ చెరుకూరి సతీష్, డర్రా దామోదర్, చిడెం రవికుమార్, మాజీ సర్పంచ్‌లు అట్టం సత్యనారాయణ, పూనెం శ్రీదేవి, పూజారి ఆదిలక్ష్మి, సూరిబాబు, ముడుంబా శ్రీనివాస్, వాజేడు మండల పార్టీ అధ్యక్షుడు రామ కృష్ణారెడ్డి, రమణారావు, పాయం విజయ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సామమల్లారెడ్డి

గోవిందరావుపేట: రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతుల సంక్షోభానికి కారణమైన టెట్ వివాదంపై పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాశాఖ కమిషనర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పస్రాలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వాసుదేవారెడ్డి అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సెప్టెంబర్‌లో అర్థాంతరంగా నిలిచిపోయిన పదోన్నతుల కొనసాగింపునకు ఆటంకంగా ఉన్న టెట్‌పై ఎన్‌సీటీఈ వివరణ తీసుకోవాలని లేఖ రాసినా పట్టించుకోలేదన్నారు. ప్రధానోపాధ్యాయులకు పని చేస్తున్న పాఠశాలల స్థాయిలో మార్పులు లేనప్పుడు పదోన్నతులకు టెట్ అవసరం లేకున్నా ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేయడం దారుణమన్నారు. టెట్‌కు దరఖాస్తులు చేయించి లక్షల రూపాయలను వృథా చేయించిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వైఖరి సరికాదన్నారు. పీఎస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు టెట్ అవసరం లేదని ఎన్‌సీటీఈ సభ్య కార్యదర్శి కేషాంగ్‌వై శర్పా ఉత్తర్వులు ఇచ్చినా చెప్పకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే విద్యాశాఖ కమిషనర్‌ను బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు ముగిసిన వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎల్.దస్రు, సుతారి పాపారావు, పత్తిరి కిరణ్, గట్టి సురేందర్, ముంద్రాతి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ ఎప్‌సెట్ ప్రవేశ పరీక్షలు

- వరంగల్ జోన్‌లో 10 పరీక్ష కేంద్రాలు.. 97శాతం హాజరు
- ఇప్పటికే ముగిసిన అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు

విద్యారణ్యపురి: టీఎస్ ఎప్‌సెట్ గురువారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఐదు సెషన్‌లలో ఉదయం, మధ్యాహ్నం ఈ పరీక్షలు నిర్వహిస్తారు. అందులో భాగంగా వరంగల్ జోన్ పరిధి 10 కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగంలో ప్రవేశ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం సెషన్ పరీక్షలకు 2,168మంది అభ్యర్థులకు 2,119 మంది హాజరుకాగా (97.7శాతం), 49మంది గైర్హాజరయ్యారని టీఎస్ ఎప్‌సెట్ కన్వీనర్ బి.డీన్ కుమార్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్‌లో 2,168మందికిగాను 2,121మంది (97.8శాతం) హాజరుకాగా, 47మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. నర్సంపేట ప్రాంతంలో రెండు కేంద్రాల్లో మొదటి సెషన్‌లో 393 మంది అభ్యర్థులకు 383మంది (97.5శాతం) హాజరుకాగా, 10మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌లో 393మందిగాను 385మంది (98శాతం) హాజరుకాగా 8మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని డీన్ కుమార్ తెలిపారు. ఈ నెల 10న రెండు సెషన్‌లు 11న మరో సెషన్‌లో ప్రవేశపరీక్షలు జరుగుతాయి.

పరిమితికి మించి ఇసుక తోడితే చర్యలు




హద్దురాళ్లను పరిశీలిస్తున్న పర్యావరణ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు



ఇసుక తవ్వకాలు జరిపిన ప్రదేశంలో లోతును పరిశీలిస్తూ..

ఏటూరునాగారం: పరిమితికి మించి ఇసుక తోడితే చర్యలు తప్పవని పర్యావరణ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి హరిచంద్రప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని ఇసుక క్వారీల యజమానులు గోదావరిలో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నారని సమాచారం అందడంతో గురువారం అధికారులు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏటూరునాగారంలోని గార పోశాలు, వల్స సదానందం, మోరవెనిని ప్రభాకర్‌రావుకు చెందిన మూడు ఇసుక క్వారీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక తవ్వకాలు లోతుగా తీయడం వల్ల భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా పట్టా భూములు ఎక్కడి వరకు హద్దులు ఉన్నాయో అక్కడి వరకే ఇసుక తవ్వకాలు జరపాలని ఆదేశించారు. రోజుకు ఎన్ని లోడ్‌ల లారీల ఇసుక తరలిస్తున్నారని ఆరా తీశారు. ఇసుకను తోడితే భూమి రావాలని కాని నీరు వస్తుందంటే తవ్వకాలు లోతుగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. లోడింగ్, అన్ లోడింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. టీఎస్ఎండీసీ సిబ్బంది ఎంత మంది ఉంటున్నారని, వారి పనితీరు ఎలా ఉందని పరిశీలించారు. లోడింగ్‌కు అన్‌లోడింగ్, ఇసుక లారీపై లెవలింగ్‌కు కూడా డబ్బులు తీసుకుంటున్నట్లు లారీల డ్రైవర్లు అధికారులకు వెల్లడించారు. ఇసుక తవ్వకాలు జరిపిన లోతులను కొలతలు వేశారు. అలాగే హద్దులు ఆనవాళ్లను పరిశీలించారు. నిబంధనలకు లోబడి ఇసుక క్వారీలను నడిపించాలని ఆదేశించారు. అతిక్రమిస్తే సీజ్ చేస్తామని హరిచంద్రప్రసాద్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మైనింగ్ ఏడీ జయరాజ్, మైన్స్ ఏడీ సర్వేయర్ శైలజ, ఏడీ ఆర్ఐ రామ్మూర్తి, గిర్దావర్(ఆర్) కిరణ్‌కుమార్, మండల సర్వేయర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

వెంకటాపురం(ఎం): ప్రజలు భయాందోళనకు గురికాకుండా నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ములుగు డీఎస్పీ రవీందర్ పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని గురువారం మండలంలోని సమస్యాత్మక ప్రాంతాలైన వెంకటాపురం, లక్ష్మీదేవిపేట గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ (పోలీసు కవాతు) నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు పూర్తయ్యేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆడిషనల్ ఎస్పీ సదానందం, ములుగు సీఐ రంజిత్‌కుమార్, ఎస్సైలు చల్లా రాజు, సతీష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బార్డర్ చెక్‌పోస్టు వద్ద మద్యం పట్టివేత

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం మద్యం దుకాణం నుంచి మహారాష్ట్రకు తరలిపోతున్న మద్యం బాటిళ్లను ఎస్ఎస్‌టీ తనిఖీ బృందం పట్టుకుంది. బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా లిక్కర్ 10.5లీటర్లు, బీర్లు 7.8లీటర్లు పట్టుకున్నారు. స్వాధీనం చేసుకొని తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని, మద్యం విలువ సుమారు రూ.5వేల వరకు ఉంటుందని కాటారం ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు.

ఆర్‌ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేస్తే చర్యలు

- ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్



లక్ష్మీపురంలో తనిఖీ చేస్తున్న క్రాంతి కుమార్

కన్నాయిగూడెం: ఆర్‌ఎంపీలు పరిమితికి మించి రోగులకు వైద్యం చేస్తే చర్యలు తప్పవని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్ అన్నారు. మండల పరిధిలోని ఆర్‌ఎంపీల పేరుతో అనుమతి లేకుండా వైద్యం చేస్తున్న కేంద్రాలపై స్థానిక వైద్యుడు అభినవ్ ఆధ్వర్యంలో క్రాంతికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం తనిఖీల్లో అనుమతి లేకుండా ఆర్‌ఎంపీల వద్ద ఉండకూడని మందులు ఉన్న వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అనుమతికి మించి వైద్యం చేయవద్దని సూచించారు. అనంతరం అవసరం లేకున్నా స్టెరాయిడ్స్, యాంటీబైటిక్స్ వంటి మందులు వాడవద్దన్నారు. నిబంధనలు పాటించని వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సెల్ సూపర్‌వైజర్ ఖలీల్, హెల్త్ అసిస్టెంట్ ఓం ప్రకాశ్, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్ పాల్గొన్నారు

హేమాచలుడిని దర్శించుకున్న ఎన్నికల వ్యయపరిశీలకులు



హేమాచలుడిని దర్శించుకున్న రాంకుమార్ గోపాల్

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలోని స్వయంభు లక్ష్మీనర్సింహస్వామిని మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయపరిశీలకులు రాంకుమార్ గోపాల్ గురువారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అధికారులు, పూజారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆయన కుటుంబ సభ్యుల గోత్రనామాలతో స్వామివారికి అర్చన జరిపించి ఆశీర్వచనం ఇచ్చారు. స్వయంభు స్వామివారి విశిష్టత, ఆలయ చరిత్రను వివరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయానికి వచ్చిన ఆయన ముందుగా పవిత్ర చింతామణి జలపాతాన్ని సందర్శించి చింతామని జలపాతం ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల స్పెషలాఫీసర్ తుల రవి, తహసీల్దార్ వీరస్వామి, ఎంపీఓ మమత, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మన్నెంను అభినందించిన గాజర్ల



చిట్యాల: మండలంలోని గుంటూరుపల్లి గ్రామానికి చెందిన మన్నెం భూలక్ష్మి–వాసు దంపతుల కుమారుడు మన్నెం అజయ్‌కుమార్ బుధవారం వెల్లడించిన సివిల్స్ ఫలితాలలో జాతీయ స్థాయిలో 44వ ర్యాంక్ సాధించి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ (ఐతు) హనుమకొండలో అజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో ఐఏఎస్ సాధించాలని ఆశాభావం వ్యక్తంచేశారు.

మీకు తెలుసా ?

దివ్యాంగులకు తోడు వెళ్లడానికి ఒకరికి ఒకసారే అవకాశం..

కాజీపేట: లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చే దివ్యాంగులు, అంధులకు సహాయకంగా ఉండడానికి ఒకరికి ఒకసారే అవకాశం ఉంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఓటు వేయడానికి దివ్యాంగుడికి తోడుగా వెళ్లడానికి ఒకరికే చాన్స్ ఇవ్వాలని నిర్ణయించింది. సహాయకులుగా వెళ్లే వ్యక్తులకు కూడా అధికారులు సిరా గుర్తు పెడుతారు. వారు తిరిగి తమ సొంత ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం కుడి చేతికి సిరా గుర్తు వేస్తారు. దీని వల్ల వారు ఎన్నికల్లో ఓటేయడానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. ఓటర్లందరికీ ఎడమ చూపుడు వేలికి సిరా గుర్తు పెట్టనున్న విషయం తెలిసిందే. సహాయకుడికి కుడి చేయి చూపుడు వేలికి సిరా గుర్తు పెడుతారు. దీంతో ఒక వ్యక్తి ఒక దివ్యాంగుడికి మాత్రమే సహాయకుడిగా వెళ్లడానికి వీలవుతుందని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

నామినేషన్ వేసిన గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గురువారం నల్లగొండ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కె.లక్ష్మణ్, ఎమ్మెల్సీ ఏవీఎస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి



ఎన్నికల సిబ్బందికి 'ఈడీసీ' అవస్థలు

- 10న ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్‌తో రావాలని ఆదేశాలు
- 12న పంపిణీ చేయాలంటున్న ఉద్యోగులు
- ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటున్న ఏఆర్‌ఓ



హన్మకొండ అర్బన్: ఎండలు మండుతున్నాయ్.. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతున్న సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణ విషయంలో ఎన్నికల సంఘం ఆదేశాలు.. జిల్లా అధికారులు, వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఉన్నతాధికారుల తీరు కిందిస్థాయి ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒక్కసారి చేయాల్సిన పనిని రెండు సార్లు చేయించడం, గతానికి భిన్నంగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో ఎండ బారిన పడి అనారోగ్యానికి గురవుతున్నామని పలువురు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌కు సంబంధించి దాదాపు అన్ని పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ క్రమంలో ఉద్యోగులు ఎన్నికల కమిషన్ తీసుకొచ్చిన ఈడీసీ (ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్) ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. గతంలో ఎన్నికల సమయంలో ఉద్యోగి ఈడీసీ ద్వారా తాను ఏ పార్లమెంట్ పరిధిలో విధులు నిర్వహిస్తే అక్కడే ఈవీఎం ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించేవారు. పోలింగ్ ముందు రోజు సామగ్రి అందజేసే క్రమంలోనే ఉద్యోగులకు ఈడీసీ ఇచ్చేవారు. కానీ, ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ఆదేశాలంటూ ఆర్‌ఓ, ఏఆర్‌ఓలు ఈ నెల 10న అంటే ఎన్నికలకు మూడు రోజుల ముందే ఈడీసీలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడే ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదాహరణకు భూపాలపల్లిలో ఎన్నికల విధులు పడిన ఉద్యోగి హనుమకొండలో నివాసం ఉంటున్నారు అనుకుంటే... అతను మామూలుగా అయితే ఈ నెల 12న పోలింగ్ ముందు రోజు భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సామగ్రితోపాటు ఈడీసీ తీసుకోవాలి. కానీ 10వ తేదీ రమ్మని చెప్పడంతో రెండు రోజుల ముందు అక్కడికి వెళ్లాలి. సుమారు 70 కిలోమీటర్లు మండుటెండలో వెళ్లి ఈడీసీ తీసుకోవాల్సి వస్తోంది. రాను పోను 140 కిలోమీటర్ల ప్రయాణం.. ఇలా నాలుగు సార్లు ఎండలో తిరగడం వల్ల ఉద్యోగులు పోలింగ్‌కు ముందు అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగులను ఇబ్బంది పెట్టే ఉద్దేశం లేదు

ప్రస్తుతం ఎన్నికలకు సబంధించి ప్రతి పని ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారమే చేస్తుంటాం. ఈడీసీ విషయంలోనూ సామగ్రి పంపిణీ సమయంలో ఇబ్బందులు రావొద్దని, పనిభారం తగ్గించడంకోసం 10న తీసుకోవాలని చెప్పాం. ఈ విషయంలో ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. దూరం ఉన్నవారు, పంపిణీ కేంద్రాల వద్ద ఈ నెల 12న కూడా తీసుకోవచ్చు. ఎవరినీ ఇబ్బంది పెట్టే ఉద్దేశంతో ఈ విధంగా చేయడంలేదు. 10న తీసుకోని వారు 12న తీసుకోవచ్చు. సమన్వయంతో పనిచేసి ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేయాలన్నదే మా లక్ష్యం.

– వెంకటే, హనుమకొండ ఆర్డీఓ, ఏఆర్‌ఓ

ఇప్పటికే అదనపు శిక్షణ

సహజంగా ఎన్నికల సమయంలో ఓపీఓలకు ఒక్కరోజు మాత్రమే శిక్షణ ఉంటుంది. కానీ, ఈసారి ఫిబ్రవరి 4న శిక్షణ ఇచ్చారు. మళ్లీ ఈ నెల 3న ఇచ్చారు. 10న ఈడీసీల కోసం రమ్మన్నారు. 12న సామగ్రి కోసం ఎలాగూ వెళ్లాల్సింటుంది. అధికారుల ఆదేశాలు, నిర్ణయాల వల్ల వరంగల్ పార్లమెంట్ పరిధిలోని వేలాది మంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా తమ ఉత్తర్వులు సడలించి పోలింగ్ సామగ్రి పంపిణీ సమయంలో ఈడీసీలు ఇవ్వాలని వరంగల్ పార్లమెంట్ పరిధిలో పోలింగ్ సిబ్బంది కోరుతున్నారు.

పల్లెల్లో డిజిటల్ ప్రచారం



ఎన్నికల ప్రచారం సరికొత్త రంగులద్దుకుంది. పల్లెల్లో సైతం డిజిటల్ స్క్రీన్ల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. గురువారం రాత్రి దేవరుప్పుల మండలం నీర్మాలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్‌కు మద్దతుగా సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లా నాయకుడు పల్ల సుందర్ రామిరెడ్డి ఆధ్వర్యంలో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, ఎన్నికల తర్వాత మాట్లాడిన ఆచరణాత్మక విస్మరణ, మోసపూరిత విధానాల తీరుపై స్క్రీన్‌పై వీడియో విజువల్స్ చూపిస్తూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రజలకు వివరించారు.

– దేవరుప్పుల

కాంగ్రెస్ గెలిస్తే అవినీతి పాలన



మాట్లాడుతున్న రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, పక్కన ఎంపీ అభ్యర్థి అరూరి, సభకు హాజరైన జనం

- వికసిత్ భారత్ ప్రధాని మోదీ లక్ష్యం
- రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ

తొర్రూరు: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే అవినీతి పాలన సాగుతుందని, పదేళ్లుగా సుపరిపాలన అందిస్తున్న ప్రధాని మోదీకి మరోసారి అవకాశం ఇవ్వాలని రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ అన్నారు. బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్‌కు మద్దతుగా గురువారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో పాలకుర్తి జనసభ పేరిట బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజస్థాన్ సీఎం హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 40 సీట్లు కూడా గెలిచే పరిస్థితిలో కాంగ్రెస్ లేదని, అలాంటప్పుడు రాహుల్‌గాంధీ ప్రధాని ఎలా అవుతారని ప్రశ్నించారు. ఇండియా కూటమిలో ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరో కాంగ్రెస్ నేతలకే తెలియదన్నారు. దేశంలో ఏ సర్వే చూసినా బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నాయని, 12 రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవబోదని జోస్యం చెప్పారు. దేశ సమగ్రత, అభివృద్ధి, ప్రజాసంక్షేమానికి మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామ మందిర నిర్మాణం, దేశ రక్షణ కోసం నిధుల కేటాయింపు, అంతర్గత భద్రతకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేసిన ఘనత మోదీకే దక్కిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. హామీలు అమలు చేయని కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో ఎలా ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. వరంగల్‌ను స్మార్ట్‌సిటీగా గుర్తించి అభివృద్ధి చేసిన ఘనత మోదీదేనన్నారు. దేశంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావాలంటే అరూరి రమేశ్‌ను గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ మాట్లాడుతూ.. ఎంపీగా అవకాశమిస్తే వరంగల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కేంద్రాన్ని ఒప్పించి నిధులు తీసుకువచ్చే బాధ్యత తీసుకుంటానన్నారు. తానెప్పుడు ప్రజా సేవకుడినేనని తెలిపారు. పాలకుర్తి, పరకాల నియోజకవర్గాలకు చెందిన ఆయా పార్టీల నాయకులు రాజస్థాన్ సీఎం సమక్షంలో బీజేపీలో చేరారు. భజన్‌లాల్ శర్మ ప్రసంగిస్తున్న సమయంలో జనం లేచిపోవడం కనిపించింది. మండుటెండలో వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ కోసం జనం ఎగబడ్డారు. బహిరంగ సభలో మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, పార్టీ నాయకులు లేగా రామ్మోహన్‌రెడ్డి, వైపీ రావు, పూసాల శ్రీమాన్, పల్లె కుమార్, రంగు రాములు, దొంగరి మహేందర్, కొలుపుల శంకర్, సాయిని ఝాన్సీ, పులేందర్, రవిబాబు, సురేష్, రవి, సుధాకర్, ఉపేందర్, సత్తెన్న, రాజేష్ పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించండి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- భువనగిరి లోక్‌సభ సీపీఎం అభ్యర్థి జహంగీర్ ఇంటింటి ప్రచారం


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

జనగామ రూరల్: 'మతోన్మాద బీజేపీని ఓడించాలి. నరేంద్ర మోదీ గెలిస్తే రాజ్యాంగానికి ప్రమాదకరం. ప్రశ్నించే కమ్యూనిస్టును పార్లమెంట్‌కు పంపాలి' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. భువనగిరి లోక్‌సభ సీపీఎం అభ్యర్థి ఎండీ జాహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ.. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో ఎంపీ అభ్యర్థి జహంగీర్ ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల సమస్యలపై పోరాడే కార్మిక పక్షపాతి అయిన సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను అత్యధిక మోజార్టీతో గెలిపించాలన్నారు. ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని.. ప్రజా గొంతుకైన సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, బూర్రి ప్రసాద్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీకాంత్, యాటల సోమన్న, రాపర్తి రాజు, విజేందర్, నాయకులు జోగు ప్రకాశ్, గోపి, అహల్య, వెంకటమల్లయ్య, శేఖర్ పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వం కార్పొరేట్‌కు బినామీ

- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి


మాట్లాడుతున్న రవి

వరంగల్ చౌరస్తా : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్‌కు బినామీగా మారిందని ఎంసీపీఐ(యూ)రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి విమర్శించారు. గురువారం వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ భాగస్వామ్య పక్షంగా ఎంసీపీఐ(యూ) అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొత్తపల్లి సావిత్రి కంప్యూటర్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మోదీ ప్రభుత్వం దేశంలో ఒకే ఎన్నికలు, ఒకే భాష, ఒకే మతమని దేశ ఆచార వ్యవహారాలపై ఆంక్షలు విధించిందే కాక ప్రజాసమస్యలు పెడదోవ పట్టించిందన్నారు. యావత్ ప్రభుత్వ రంగం ప్రైవేటీకరణ కావడం, మోదీ పాలనలో విద్య కాషాయీకరణ చేయడం మొత్తంగా మతోన్మాద పాలన కొనసాగుతుందన్నారు. సమావేశంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి, అభ్యర్థి కొత్తపల్లి సావిత్రి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, నాయకులు మంద రవి, కుమారస్వామి, కుసుంబ బాపు రావు, గడ్డం నాగార్జున, కర్ర రాజిరెడ్డి, ఎగ్గని మల్లికార్జున్, ఐతం నగేష్, అప్పనపూరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశంలో కాంగ్రెస్ సునామీ రాబోతోంది


సమావేశంలో మాట్లాడుతున్న కడియం కావ్య

- బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజల్లో మద్దతు లేదు
- మీట్‌ది ప్రెస్‌లో కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య

నయీంనగర్: కాంగ్రెస్ పార్టీది గాలి కాదని.. సునామీ అని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ దేశంలో భారత్ జోడో యాత్ర ద్వారా రాహుల్‌గాంధీ రైతులు, శ్రామికులు, కర్షకులు, కార్మికులు, ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ 5న్యాయ్–25గ్యారంటీలతో ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యనే ఉంటుందని.. బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజల్లో మద్దతు లేదన్నారు. కవిత అరెస్ట్‌పై ప్రజల్లో సానుభూతి లేదన్నారు. దేశాన్ని పదేళ్లు పాలించిన బీజేపీ కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వలేదన్న విషయాన్ని గ్రహించాలన్నారు. అరూరి రమేష్ ఓడిపోతున్నాడు కాబట్టే కడియం శ్రీహరిపై ఆరోపణలు చేస్తున్నాడని చెప్పారు. లిక్కర్ స్కాం, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల భూకబ్జా ఆరోపణలు తన గెలుపునకు నష్టంచేస్తాయని కాంగ్రెస్ పార్టీలోకి వచ్చామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా వరంగల్ అభివృద్ధి చెందకుండా ఆరు ముక్కలు చేసి ప్రజలకు తీవ్ర నష్టం చేసిందని దుయ్యబట్టారు. తనను గెలిపిస్తే వరంగల్‌ను హైదరాబాద్ తీరులో అభివృద్ధి చేస్తానని హామీఇచ్చారు. ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు, ఐఐఎం, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టమ్, వరంగల్ ఐటీ పార్క్ విస్తరణ, తాగు–సాగు నీటి ఏర్పాటు, ఎస్ఎంఈల ఏర్పాటు, రిహాబిలిటేషన్ సెంటర్, ఇన్ పేషెంట్ సైకియాట్రిక్ సెంటర్ ఏర్పాటు చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీలో గ్రామ కార్యకర్త నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు అందరూ సహకరిస్తున్నారని తన గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, జర్నలిస్టు సంఘాల నాయకులు బీఆర్.లెనిన్, మెండు రవీందర్ పాల్గొన్నారు.

దివ్యాంగ అభ్యర్థులకు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో జేఆర్ఎఫ్, యూజీసీ ఫెలోషిప్‌లు కలిగిన పలువురు దివ్యాంగ అభ్యర్థులకు పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పించకుండా యూనివర్సిటీ అధికారులు జాప్యం చేస్తున్నారు. ఈ విషయంపై కొన్ని నెలలుగా వారు యూనివర్సిటీ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో గురువారం దివ్యాంగ అభ్యర్థుల తోపాటు వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. యూజీసీ నిబంధనల ప్రకారం త్రిమెన్ కమిటీవేసి వారికి వెంటనే అడ్మిషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రార్ మల్లారెడ్డి స్పందిస్తూ నాలుగురోజుల్లో పీహెచ్‌డీ అడ్మిషన్ల విషయంలో చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారని విద్యార్థి సంఘాల బాధ్యులు తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగ అభ్యర్థులు బొమ్మెర సతీష్, విజయ, దాసరి శ్రీనివాస్, సంతోష్ కుమార్, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజునాయక్, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ కల్లెపెల్లి ప్రశాంత్, అధ్యక్షుడు శివ, ఇతర సంఘాల బాధ్యులు రాజిరెడ్డి, నాగరాజు,సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


రిజిస్ట్రార్‌కు విన్నవిస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

సిగ్నల్ తండా రోడ్డు పరిశీలన

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధి సిగ్నల్ తండా రోడ్డును గురువారం అధికారులు పరిశీలించారు. తమ తండాకు రోడ్డు సౌకర్యం కల్పించకపోవడాన్ని నిరసిస్తూ పార్లమెంట్ ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరిస్తూ తండాకు వెళ్లే మార్గంలో స్థానికులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ విషయంపై పలు పత్రికల్లో కథనాలు ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. డోర్నకల్ తహసీల్దార్ కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి, సీఐ బి.ఉపేందర్‌రావు, ఐటీడీఏ ఏఈ ప్రశాంత్.. సిగ్నల్ తండా రోడ్డును పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. రూ.52 లక్షల ఐటీడీఏ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు భూసమస్యలతో నిలిచాయని ఐటీడీఏ ఏఈ ప్రశాంత్ తెలిపారు. అధికారుల చొరవతో శుక్రవారం నుంచి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జర్పుల వీరన్న, మున్సిపల్ ఏఈ పాషా, సర్వేయర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

బీర్ల కోసం.. బారులు

- వైన్స్‌లు తెరవకముందే మందుబాబుల క్యూలైన్లు


బీర్లు లేవని ఓ వైన్స్‌లో ఏర్పాటు చేసిన బోర్డు

మహబూబాబాద్ రూరల్ : జిల్లాలో బీర్ల కొరత ఏర్పడడంతో మందుబాబులు అసహనానికి గురవుతున్నారు. ఎండవేడికి తాళలేక చల్లటి బీరుతాగి ఉపశమనం పొందుదామనే మద్యం ప్రియుల ఆశలు అడియాశలవుతున్నాయి. పట్టణంలోని అన్ని మద్యం దుకాణాల్లో బీర్లు లేవనే బోర్డులు ప్రత్యక్ష మవుతున్నాయి. అయితే బీర్లు గురువారం వస్తాయనే సమాచారం అందుకున్న మందుబాబులు ఉదయం నుంచే వైన్స్ షాపుల ముందు పడిగాపులు కాశారు. షాపులు ఎప్పుడు తెరుస్తారు.. ఎప్పుడు బీర్లు తీసుకుందామనే ఆతృతతో ఎదురుచూశారు. వైన్స్ షాపులు తెరవడమే ఆలస్యం.. పెట్టెలకు పెట్టెల బీర్లు కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. రేషన్ షాపులో సరుకుల కోసం, కొత్తగా విడుదలైన సినిమా టికెట్ల కోసం ఏ విధంగానైతే ఎగబడుతుంటారో ఆ విధంగా మందుబాబులు దుకాణాల ముందు నిలబడడం అందరిని ఆశ్చర్యపరిచింది. కాగా, బీర్ల కొరతతో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ధర్నాలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

పాల బిల్లులు చెల్లించాలి

- విజయ డెయిరీ డీడీకి పాడి రైతుల వినతి


ప్రదీప్‌కుమార్ వినతిపత్రం అందజేస్తున్న సంఘం బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: వరంగల్ మిల్క్‌షెడ్ పరిధిలో 45 రోజులుగా పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే చెల్లించాలని విజయ కాకతీయ పాడిరైతుల సంక్షేమ సంఘం వరంగల్ అధ్యక్షుడు ఇరుకు దేవేందర్‌రావు కోరారు. హనుమకొండ ములుగు రోడ్ సమీపంలోని విజయ డెయిరీ వరంగల్ యూనిట్ ఆవరణలో గురువారం సంఘం ఆధ్వర్యంలో పాడి రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్‌రావు మాట్లాడుతూ వరంగల్ మిల్క్‌షెడ్ పరిధిలో సుమారు 5వేల మంది రైతులు డెయిరీలో పాలు పోస్తున్నారని, ప్రతి పదిహేను రోజులకు ఒకసారి చెల్లించాల్సిన బిల్లులు 45 రోజులు గడుస్తున్నా ఇవ్వలేదన్నారు. దీనికి తోడు గత ప్రభుత్వం అందించిన ప్రతి లీటర్‌కు రూ.4 ప్రోత్సాహకం కూడా రెండేళ్లుగా పెండింగ్‌లోనే ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 ఇన్సెంటివ్ ఇస్తానని ప్రకటించిందని, అది కూడా అందడం లేదని వాపోయారు. ప్రైవేటు డెయిరీల పోటీని తట్టుకుని ప్రభుత్వ రంగ సంస్థను కాపాడుకుంటున్న రైతులను ఆర్థికంగా మరింత కృంగదీయడం సరికాదన్నారు. అనంతరం వరంగల్ డెయిరీ డీడీ జీ ప్రదీప్‌కుమార్ కు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో నాయకులు రాసాల సమ్మయ్య, మహేందర్, పరుచూరి నరేంద్ర, రాజిరెడ్డి, గోపాల్, దామోదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే చరిత్రలో 1974 మరుపురాని ఘట్టం

కాజీపేట రూరల్: భారతీయ రైల్వే చరిత్రలో 1974 సంవత్సరం మరుపురాని ఘట్టమని రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ చైర్మన్ ఎస్‌కె.జానీమియా, సెక్రటరీ పి.వేదప్రకాశ్, ట్రెజరర్ జి.రాజేశ్వర్ అన్నారు. బోనస్ కోసం 1974లో రైల్వే కార్మికులు దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెకు గురువారంతో 50 ఏళ్లు కావొస్తుంది. ఈ సందర్భంగా ఏఐఆర్ఎఫ్, ఎస్‌సీఆర్ఎంయూ పిలుపు మేరకు ఆ సమ్మెలో అసువులు బాసిన కార్మికులకు నివాళులర్పించే కార్యక్రమంలో భాగంగా డీజిల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ నుంచి డీజిల్ కాలనీ ఎంట్రన్స్ వరకు గురువారం రాత్రి కొవొత్తుల ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. బోనస్ కోసం 1974లో నలుగురు రైల్వే కార్మికులు అమరులయ్యారన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.యాదగిరి, ఎస్.తిరుపతి, కె.భాస్కర్‌రెడ్డి, జి.నాగరాజు, ఎ.సత్యనారాయణ, నరేష్ యాదవ్, కె.భీష్మదేవ్, తదితరులు పాల్గొన్నారు.

నిట్‌తో ఒప్పందానికి సిద్ధం

- పోటీ పడుతున్న విద్యా సంస్థలు, కళాశాలలు
- ప్రస్తుతం 84 ఎంఓయూలు
- పరిశోధనలు, ఇంటర్న్‌షిప్, నూతన ఆవిష్కరణలకు వేదిక



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌తో కలిసి పరిశోధనలను, నూతన ఆవిష్కరణలను, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సౌకర్యం కల్పించేందుకు నిట్‌తో ఎంఓయూ కుదుర్చుకునేందుకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు, కళాశాలలు పోటీ పడుతున్నాయి. 1959 అక్టోబర్ 10న ప్రారంభమై అత్యుత్తమ టెక్నికల్ విద్యను బోధిస్తూ, పరిశోధనలతో, విద్యార్థుల క్యాంపస్ సెలక్షన్లతో మొదటి స్థానంలో నిలుస్తోంది నిట్ వరంగల్. నిట్‌తో ఎంఓయూ కుదుర్చుకుంటే చాలు ప్రపంచ స్థాయి సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు అంటూ పోటీ పడే స్థాయికి నిట్ వరంగల్ చేరింది. ప్రస్తుతం నిట్ వరంగల్ 84 వివిధ రకాల ఎంఓయూలను కుదుర్చుకుంది.

ఓరుగల్లును స్మార్ట్‌గా తీర్చిదిద్దేందుకు..

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో నగరాన్ని స్మార్ట్‌గా తీర్చిదిద్దేందుకు జీడబ్ల్యూఎంసీతో నిట్ వరంగల్ ఒప్పందం కుదుర్చుకుంది. సైడ్ డ్రైయిన్స్, రోడ్లు, చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు వివిధ రకాల యాప్స్‌ను రూపొందించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది.

నిట్ వరంగల్‌తో ఎంఓయూలు ఇలా..

భువనేశ్వర్‌లోని సీఎస్ఆర్–ఐఐఎంటీ, ఐఐటీ గోవా, వీజేటీఐ ముంబాయి, నిట్ జమ్‌షెడ్‌పూర్, కర్నూల్‌లోని ఐఐఐటీడీఎం, విశాఖపట్నంలోని ఐఐఎం, ఐఐటీ జమ్ము, ఐఐటీ భువనేశ్వర్, ఐఐటీ హైదరాబాద్, జైపూర్‌లోని మాలవ్య ఎన్ఐటీ, హైదరాబాద్ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్ బెంగళూరు, ది లక్ష్య ఫౌండేషన్ వరంగల్, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ హైదరాబాద్, స్వీడెన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ మలార్‌డలాన్, టీఎస్ కాస్ట్ హైదరాబాద్ వంటి సంస్థలు కళాశాలలు నిట్ వరంగల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి.

పరిశ్రమల్లో పరిశోధనలకు..



హైదరాబాద్‌లోని ఎన్ఐ–ఎంఎస్ఎంఈ చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో పరిశోధనలకుగాను నిట్ వరంగల్‌తో ఎన్ఐ–ఎంఎస్ఎంఈతో ఎంఓయూ కుదుర్చుకున్నది. విద్యార్థులకు పరిశ్రమలపై అవగాహనకుగాను శిక్షణా తరగతుల్ని నిర్వహించి పరిశ్రమల స్థాపనకు ఒప్పందం తోడ్పడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలకు విద్యార్థులు పరిశోధనలు చేపడుతున్నారు.

మెడికల్ సైన్స్‌లో పరిశోధనలకు ఏయిమ్స్‌తో..



నిట్ వరంగల్‌లోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వైద్య రంగంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని అందజేసేందుకు బీబీనగర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌తో ఎంఓయూ కుదుర్చుకుంది. స్మార్ట్ హెల్త్‌కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ఇరు విద్యా సంస్థల విద్యార్థులు పరిశోధనలు చేపడుతున్నారు.

విద్యార్థుల పరిశోధనలకు సీఎస్ఐఆర్‌సీఆర్ఆర్ఐతో



నిట్ వరంగల్‌లోని విద్యార్థులు ట్రాన్స్‌పోర్టేషన్లు, రోడ్లపై పరిశోధనలను చేపట్టేందుకు న్యూఢిల్లీ సెంట్రల్ రోడ్డు రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌తో నిట్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకుని సీఆర్ఆర్ఐ, నిట్ విద్యార్థులు పరస్పరం పరిశోధనలను చేపడుతున్నారు.

ఎంఓయూలతో అభివృద్ధి



వివిధ కళాశాలలతో, సంస్థలతో పరస్పర ఒప్పందంతోనే అభివృద్ధి, పరిశోధనలు సాధ్యమవుతాయి. విద్యార్థులు విద్యను పూర్తి చేసిన అనంతరం ఇంటర్న్‌షిప్ కోసం సైతం ఎంఓయూలు తోడ్పడతాయి. నూతన ఆవిష్కరణలతో పాటు క్యాంపస్ సెలక్షన్స్‌లో రాణించేందుకు, పరిశ్రమల స్థాపనకు ఎంఓయూలు తప్పనిసరి. నిట్ వరంగల్‌తో ఎంఓయూ కుదుర్చుకునేందుకు ప్రపంచ స్థాయి సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నాయి, విద్యార్థుల అభివృద్ధి కోసం నిట్ ఎంఓయూలను స్వాగతిస్తోంది.

– బిద్యాధర్ సుబుదీ, డైరెక్టర్ నిట్ వరంగల్

ఇంటర్న్‌షిప్‌నకు కెనడాలోని సాస్ క్యాట్ చేవాన్‌తో..

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సౌకర్యం కల్పించేందుకు నిట్ వరంగల్‌తో కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ సాస్‌క్యాట్ చేవాన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇంటర్న్‌షిప్ అవకాశంతో పాటు నూతన ఆవిష్కరణల కోసం రీసెర్చ్ చేపట్టి పరిశోధన పత్రాలను ప్రచురించడంలో ఈ ఎంఓయూ ఉపయోగపడుతుంది.



క్లుప్తంగా...

కెప్టెన్ లక్ష్మీకాంతారావును కలిసిన మహమూద్ అలీ

హన్మకొండ: మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వొడితల లక్ష్మీకాంతారావును మాజీ హోం మంత్రి మహమూద్ అలీ కలిశారు. గురువారం హనుమకొండలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వచ్చిన మహమూద్ అలీ హనుమకొండ హంటర్ రోడ్డులోని స్వగృహంలో కెప్టెన్ లక్ష్మీ కాంతారావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనవెంట వినయ్‌భాస్కర్, ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ ఉన్నారు.

పక్షపాత వైఖరికి నిరసనగా బైకాట్

- అకుట్ అధ్యక్షుడు శ్రీనివాస్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేష్ ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తూ అధ్యాపకులపై పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారని, అందుకే ఈనెల 8న జరిగిన రిటైర్డ్ ప్రొఫెసర్ల సన్మాన సభ కార్యక్రమాన్ని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకుట్) బైకాట్ చేసిందని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో హిస్టరీ, తెలుగు, ఇంగ్లిష్, బాటనీ, ఎడ్యుకేషన్ విభాగాల్లో ఉద్యోగ విరమణ పొందిన అధ్యాపకులకు వారికి కనీసం సన్మానం చేయలేదన్నారు. గతంలో కేయూ వీసీలుగా బాధ్యతలు నిర్వర్తించిన వారు తమ హయాంలో ఎవరైనా అధ్యాపకులు ఉద్యోగ విరమణ పొందితే అదే నెలాఖరున సన్మానం చేసి ఆయా అధ్యాపకులకు రావాల్సిన బెనిఫిట్స్ కూడా ఇచ్చేవారన్నారు. వీసీగా బాధ్యతలను చేపట్టాక ప్రొఫెసర్ రమేష్ కొందరి అధ్యాపకులు ఉద్యోగ విరమణ పొందినా సన్మానం చేయలేదన్నారు. అర్హులకు సీనియర్ ప్రొఫెసర్‌గా పదోన్నతులు కల్పించలేదని ఆరోపించారు. తాను మాత్రం సీనియర్ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించుకున్నారన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందినవారిలో కొందరికే ఎరియర్స్ చెల్లించారని, మరికొందరికి చెల్లించలేదన్నారు. డిపార్టుమెంటల్ కమిటీలు లేకుండా చేసిన బదిలీలు, నియామకాలు చెల్లుబాటుకావన్నారు. పలు అంశాలల్లో వీసీ రమేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేశామని తెలిపారు.

మొక్కజొన్న చొప్ప కాలుస్తూ అనంతలోకాలకు..

- మంటలు అంటుకుని రైతు మృతి
- పాపయ్యపేటలో ఘటన



పాపారావు(ఫైల్)

చెన్నారావుపేట: మొక్కజొన్న చొప్ప కాలుస్తున్న క్రమంలో మంటలు అంటుకుని ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం సాయంత్రం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అల్లంనేని పాపారావు(72) తన మొక్కజొన్న చొప్ప పంటను కాల్చడానికి చేను వద్దకు వెళ్లాడు. చొప్పను కాల్చుతున్న క్రమంలో మంటలు విస్తరించి సమీపంలోని రైతు ప్రకాశ్‌రావు పామాయిల్ తోటకు విస్తరించాయి. మంటలు ఆర్పే ప్రయత్నంలో అంటుకుని పాపారావు మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంలో యువకుడు..



సామితేష్ (ఫైల్)

గూడూరు: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి గూడూరులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన గంప సామితేష్ (26) తన ఇంటి స్లాబ్ ఎక్కుతుండగా గాలిదుమారం వీచింది. ఆ సమయంలో బిల్డింగ్‌పై ఉన్న ఓ ఇనుప రాడ్ ఎదుట ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలపై పడింది. ఆ రాడ్ సామితేష్ చేతికి తగలగా షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై తండ్రి యుగందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై సీహెచ్. నగేష్ గురువారం తెలిపారు.

టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా మహాత్మ

- స్పోక్స్ పర్సన్‌గా వేముల రమేష్



మహాత్మ



వేముల రమేష్

వరంగల్ లీగల్ : రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, సీనియర్ న్యాయవాది నల్ల మహాత్మను టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా, ఉద్యమకారుడు, న్యాయవాది వేముల రమేష్‌ను టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర స్పోక్స్ పర్సన్‌గా నియమిస్తూ టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మహాత్మకు సీనియర్ న్యాయవాదిగా జిల్లాలో గుర్తింపు ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాల కోర్టులలో న్యాయవాదిగా చేస్తూ పార్టీకి విశిష్ట సేవ చేస్తున్నారు. వేముల రమేష్ హనుమకొండ, వరంగల్ జిల్లాల కోర్టులలో న్యాయవాది కొనసాగుతున్నాడు. తమపై నమ్మకంతో ఈ పదవుల్లో నియమించిన టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్రంలో మార్పు అవసరం

- ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటనారాయణ

రామన్నపేట : రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు కేంద్రంలో మార్పు అవసరమని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ స్పష్టం చేశారు. 10 సంవత్సరాలు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ బడుగుబలహీన వర్గాలను అణచివేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్‌లోని రత్న హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కేసీఆర్‌కు శాసనసభ ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టి ఓడించారన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేసిన ఆర్థిక, సామాజిక విధానాలు తిరోగమన దిశలో ఉన్నాయని ఎద్దేవా చేశారు. అనంతరం కేంద్రంలో కూడా మార్పు కావాలనే నినాదంతో రెండు పేజీల కరపత్రాన్ని విడుదల చేశారు. ప్రజాసంఘాల జేఏసీ వైస్ చైర్మన్ సంగాని మల్లేశ్వర్, సామాజిక ఉద్యమకారుడు సోమ రామ్మూర్తి, బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర నాయకులు గునిగంటి శ్రీనివాస్‌గౌడ్, దయాల సుధాకర్, పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాని శ్రీనివాస్, కేయూ విద్యార్థి జేఏసీ నాయకుడు సుధాకర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి, పక్కన టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం

నర్సంపేట : భారత రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట వాసవి కల్యాణ మండపంలో టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రజా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో కేవలం రూ.68 లక్షల కోట్లు అప్పులు అయితే.. పదేళ్ల మోదీ పాలనలో రూ.కోటి రెండు లక్షల కోట్లు అప్పులు అయ్యాయని తెలిపారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణలో కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పు చేశారన్నారు. మోదీ విధానాలతో వ్యవసాయ ఉత్పత్తులు పడిపోయి పరిశ్రమలు దివాళా తీశాయని పేర్కొన్నారు. పన్నుల భారం వేయడంతో ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిందన్నారు. 18 మంది బడాబాబులకు ప్రధాని రూ.1,350 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారని విమర్శించారు. సదస్సులో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగన్న, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మైస శ్రీనివాస్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం చైర్మన్ వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే బీసీల మద్దతు

- బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణగౌడ్



మాట్లాడుతున్న రవికృష్ణగౌడ్

కాజీపేట రూరల్: కాంగ్రెస్ పార్టీకే బీసీ సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్ అన్నారు. కాజీపేట ఫాతిమానగర్‌లోని వైష్ణవిగ్రాండ్ హోటల్‌లో గురువారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో బీసీల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యలు పాల్గొనగా రవికృష్ణ గౌడ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలు, బీసీ కుల సంఘాలు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలుపాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి బీసీల సమస్యలపై వినతిపత్రం ఇవ్వగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు మాట్లాడుతూ బీసీలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరగుతుందన్నారు. బీసీలకు అండగా కాంగ్రెస్‌పార్టీ ఉంటుందని తెలిపారు. ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడటానికి గెలిపించాలని కోరారు. నాయకులు ఎదునూరి రాజమొగిళి, బచ్చు ఆనంద్, తమ్మన శోభారాణి, సంపత్‌కుమార్, పెండ్యాల హరిప్రసాద్, మారగోని భద్రయ్య, వడ్నాల నరేందర్, లక్ష్మి, కృష్ణమూర్తి యాదవ్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌లో మళ్లీ అగ్నిప్రమాదం

- గాలికి ఎగిసిపడుతున్న మంటలు



డంపింగ్‌యార్డ్‌లో ఎగిసిపడుతున్న మంటలు

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సుగుట్ట ప్రాంగణంలో బల్దియా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌లో గురువారం రాత్రి మళ్లీ అగ్నిప్రమాదం సంభవించింది. గాలి దుమారంతో ఆకస్మాత్తుగా మంటలు ఎగిసి పడుతున్నాయి. డంపింగ్ యార్డ్ పక్కన టాటా వాహన షోరూం, రోడ్డు పక్కన బీరన్న కాలనీ ఉండటంతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. మంటలు ఎక్కడ వ్యాప్తి చెందుతాయోనని ఆందోళన చెందుతున్నారు. స్థానికుల సమాచారం అందుకున్న ఫైర్ అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

చదవండి.. నేర్చుకోండి

- వేసవి సెలవుల్లో విద్యార్థుల పఠనా సామర్థ్యాల పెంపే లక్ష్యం..
- రూమ్ టు రీడ్ సంస్థ ద్వారా లిటరసీ క్లౌడ్ వెబ్‌సైట్ రూపకల్పన
- క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి కూడా చదువుకోవచ్చు
- ఎనిమిది భాషల్లో 1224 కథలు..

విద్యారణ్యపురి: వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇళ్లల్లోనే ఉంటారు. ఆటాపాటలతో ఎక్కువగా గడుపుతుంటారు. అంతేగాకుండా సెల్‌ఫోన్లలో గేమ్స్ కూడా ఆడుతుంటారు. అయితే ఈ వేసవి సెలవుల్లో తమలోని పఠనా సామర్థ్యాలు పెంపొందించుకునేలా, వివిధ కథలు చదువుకునేలా »రూమ్ టు రీడ్« అనే సంస్థ లిటరీ క్లౌడ్ అనే వెబ్‌సైట్‌ను రూపకల్పన చేసింది. విద్యార్థులు దీనిని వినియోగించుకునేలా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

లిటరసీ క్లౌడ్

ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో పఠనానైపుణ్యం, చదవడం అలవాటు చేయడం ద్వారా వారిలో మౌఖిక భాష వికాస అభివృద్ధి, అభ్యసన సామర్థ్యాలు పెంపొదించొచ్చు. ఈ వేసవిలో విద్యార్థుల అభ్యసనలో అంతరాయం లేకుండా చదవడం, నేర్చుకోవడం కొనసాగింపులో భాగంగా రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్.. లిటరసీ క్లౌడ్ మాధ్యమం ద్వారా ఆకర్షణీయ, అభిరుచి కలిగించే తెలుగు పుస్తకాలు అందుబాటులోకి తీసుకొచ్చింది.

చదవండి.. నేర్చుకోండి

ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి విద్యార్థుల పఠన సామర్థ్యాల పెంపే లక్ష్యంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసించే విద్యార్థులు రూమ్ టు రీడ్ సంస్థ రూపొందించిన లిటరసీ క్లౌడ్ వెబ్‌సైట్‌ను వినియోగించుకునేలా చూడాలని డీఈఓ అబ్దుల్‌హై సూచించారు. జిల్లాలోని ప్రతి హెచ్ఎం, ఉపాధ్యాయుడు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.లిటరసీక్లౌడ్.ఓఆర్‌జి అనే వెబ్‌సైట్‌ను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలపాలన్నారు. విద్యార్థులు వెబ్ సైట్‌లోని కథలు చదివేలా చేస్తే వారిలో పఠనా సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. తల్లిదండ్రులు తమ విరామ సమయాల్లో పిల్లలను కథలు చదించాలని పేర్కొన్నారు. రూమ్ టు రీడ్ సంస్థ రాష్ట్రంలో ఇప్పటికే వివిధ పాఠశాలల్లో 880 గ్రంథాలయాలు ఏర్పాటు చేసిందన్నారు. మరింత మంది విద్యార్థులకు చేరువకావడానికి, వేసవి సెలవులు సద్వినియోగానికి లిటరసీ క్లౌడ్ సైట్‌ను రూపొందించిందని డీఈఓ వివరించారు.

ఎనిమి భాషల్లో 1,224 కథలు..

లిటరసీ క్లౌడ్ వెబ్‌సైట్‌లో తెలుగులో 118 , ఆంగ్లంలో 47, హిందీలో 199, ఉర్దూలో 58 కథలు ఉన్నాయని, ఇవే కాక బెంగాలీ, కన్నడ, మరాఠి, తమిళ భాషల్లో కూడా కథలు ఉన్నాయి. ఆయా భాషల మాతృభాష కలిగిన విద్యార్థులు వీటిని వినియోగించుకోవచ్చు. ఎనిమిది భారతీయ భాషల్లో మొత్తం 1,224 కథలు ఈ వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు అభ్యసించొచ్చు.ఈ కథలు క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి కూడా చదువుకోవచ్చు. ఈ క్యూ ఆర్ కోడ్‌ను హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు పంపారు.ఆ క్యూఆర్‌కోడ్‌ను వాట్సాప్ గ్రూపులలో విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా పంపాలని సంబంధిత అధికారులు ఆదేశించారు.



రూమ్ టు రీడ్ సంస్థ రూపొందించిన క్యూ ఆర్‌కోడ్

వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలి



లిటరసీ క్లౌడ్ వెబ్‌సైట్‌ను ఈ వేసవి సెలవుల్లో వినియోగించుకుని వివిధ భాషలపై పట్టు పెంచుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలకు సూచించాలి. వీటి ద్వారా విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోగలుగుతారు.

– ఎ శ్రీనివాస్ , కోఆర్డినేటర్ జిల్లా క్వాలిటీ

బెదిరించి డబ్బులు కాజేసిన ఇద్దరి అరెస్టు

రామన్నపేట: తనకు రావాల్సిన డబ్బులు ఇప్పిస్తానని నమ్మించి, బాధితుడినే బెదిరించి రూ.53 లక్షలు కాజేసిన హైదరాబాద్‌కు చెందిన కొంగర శ్రీకాంత్, సోషల్ వెల్ఫేర్ స్కూల్ లైబ్రేరియన్ ఉప్పునూతల విష్ణును టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. వారినుంచి రూ.8.50 లక్షలు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ టి.గోపి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సైబర్‌నేరగాడు అయిన నాయుడు అనే వ్యక్తి వాట్సాప్ కాల్ ద్వారా ఎస్.పూర్ణచందర్‌రావుకు కాల్ చేసి రూ.5 కోట్లు మాకు ట్రాన్స్‌ఫర్ చేస్తే మీకు తిరిగి రూ.15 కోట్లు ఆర్టీజీఎస్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేస్తామని నమ్మించాడు. పటేల్, ప్రజాపతి అనే ఇద్దరు వ్యక్తులను కంపెనీ డైరెక్టర్లు అని నమ్మించి వారితో కూడా పూర్ణచందర్‌రావుతో మాట్లాడించాడు. ఇది నమ్మిన పూర్ణచందర్‌రావు రూ.5 కోట్లను హవాలా ద్వారా ఢిల్లీకి ట్రాన్స్‌ఫర్ చేశాడు. రూ.15 కోట్లు పద్దాయని నాయుడు వాట్సాప్‌లో పూర్ణచందర్‌రావుకు ఫేక్ మెసేజ్ పంపాడు. అది చూసి నమ్మిన పూర్ణచందర్‌రావు బ్యాంకు వెళ్లి తన ఖాతా చెక్ చేసుకోగా ఎలాంటి డబ్బులు రాలేదని గ్రహించాడు. వెంటనే హవాలా దళారులు అయిన వరంగల్‌కు చెందిన కొంగర శ్రీకాంత్, విష్ణును సంప్రదించి వారి ద్వారా నాయుడుతో ఫోన్ మాట్లాడి పోలీసులకు పట్టిస్తామని బెదిరించారు. దీంతో నాయుడు.. పూర్ణచందర్‌రావు కు రూ.1.27 కోట్లు తిరిగి చెల్లించాడు. మిగతా రూ.3.70కోట్లు తిరిగి ఇప్పిస్తామని శ్రీకాంత్, విష్ణులు పూర్ణచందర్‌రావును నమ్మించి రూ.53లక్షలు వసూలు చేశారు. ఈ డబ్బులను క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్స్ రూపంలోకి మార్చామని, చోటా షకీల్, దావూద్ ఇబ్రహీం మనుషులమని పూర్ణచందర్‌రావును బెదిరింపులకు గురిచేశారు. చివరికి మోసపోయానని గ్రహించిన పూర్ణచందర్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి గురువారం ములుగు రోడ్డు జంక్షన్‌లో విష్ణు, శ్రీకాంత్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8.50 లక్షలు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రక్తసిక్త రహదారులు..

రహదారులు రక్తసిక్తమయ్యాయి. బుధ, గురువారాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.



కల్యాణ్(ఫైల్)

భూపాలపల్లి రూరల్ : బైక్ అదుపుతప్పి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన భూపాలపల్లి మండలం కొంపెల్లిలో జరిగింది. భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్ కథనం ప్రకారం భూపాలపల్లి మండలం గుడాడ్‌పల్లికి చెందిన లాపాక కల్యాణ్(25) బైక్‌పై బుధవారం రాత్రి గుడాడ్‌పల్లి నుంచి చెల్పూర్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో కొంపల్లిలో బైక్ అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గట్లనర్సింగాపూర్‌లో వృద్ధుడు..

ఎల్కతుర్తి: లారీ ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లో జరిగింది. ముల్కనూరు ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మోరే బుచ్చయ్య(53) బుధవారం సాయంత్రం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. తిరిగి రాత్రి తన ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో హుస్నాబాద్ వైపు వెళ్తున్న లారీ.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. బుచ్చయ్య తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చింతపల్లిలో మరో యువకుడు..

ఎల్కతుర్తి: బైక్ అదుపుతప్పి ఓ యువకుడు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం మండలంలోని చింతలపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై గోదారి రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన ఒగ్గు సతీష్(32) ద్విచక్రవాహనంపై తన బంధువు దామెరకు చెందిన కంప నాగరాజు ఇంటికి వచ్చారు. ఎల్కతుర్తి నుంచి దామెరకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి మార్గమధ్యలోని చింతలపల్లి వద్ద అదుపుతప్పి మోరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో సతీష్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో ఎంజీఎం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ద్విచక్ర వాహనం వెనుక ఉన్న మరో వ్యక్తి నాగరాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

నిమ్మగూడెంలో కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు..



కీర్తిబాయి(ఫైల్)

మహాముత్తారం: మహాముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు కీర్తిబాయి రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. మండలంలోని బోర్లగూడేనికి చెందిన కీర్తిబాయి గురువారం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పక్కల రాజబాబును మంత్రి శ్రీధర్ బాబు వద్దకు తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీలో చేర్పించారు. అనంతరం యామన్‌పల్లి నుంచి బోర్లగూడెం వెళ్తున్న క్రమంలో నిమ్మగూడెం ప్రధాన రహదారిలోని గట్టమ్మ సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కీర్తిబాయి అక్కడికక్కడే మృతి చెందగా కారు నడుతున్న రాజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలికి చేరుకున్న ఎస్సై మహేందర్‌కుమార్ వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, ఎన్నికల ప్రచారం పాల్గొని వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కీర్తిబాయి కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని లంబాడీ హక్కుల పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్‌సింగ్ డిమాండ్ చేశారు.

దేవాదుల పంపుహౌస్ దొంగల అరెస్టు

ఏటూరునాగారం: దేవాదుల పంప్‌హౌస్ సబ్ స్టేషన్‌లో రాగి తీగను అపహరించిన ఐదుగురిని ఏటూరునాగారం సీఐ మండల రాజు, కన్నాయిగూడెం ఎస్సై సురేష్ ఏటూరునాగారం మండలం పస్రా పురం క్రాస్ వద్ద పట్టుకున్నట్లు ఏఎస్పీ మహేష్ గీతె బాబాసాహెబ్ తెలిపారు. గురువారం ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంగపేట మండలం కమలాపురం నుంచి రెండు బైక్‌లపై ఐదుగురు వ్యక్తులు వస్తున్నారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా అందులో పాత నేరస్తుడు నిమ్మల వినయ్ కుమార్ ఉన్నాడు. అతడి వద్ద ఒక కత్తి లభించడంతో మిగతా వారిని విచారించారు. ఈనెల 3వ తేదీన అర్ధరాత్రి దేవాదుల పంపు హౌస్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో సిబ్బందిని కొట్టి అక్కడ ఉన్న సుమారు 300 మీటర్ల కాపర్ వైర్ ఎత్తుకెళ్లారు. వైర్‌ను మంగపేట మండలం బోరునర్సాపురంలోని పాత ఇనుప సామాను కొనుగోలు చేసే వ్యాపారి దండుగుల లక్ష్మయ్యకు విక్రయించినట్లు ఒప్పుకున్నారు. దీంతో మంగపేట మండలం కమలాపురానికి చెందిన నిమ్మల వినయ్‌కుమార్, ఎస్‌కే. పాషా, పండి మాధవరావు, మొట్లగూడేనికి చెందిన పాలుగుపల్లి సాయికిశోర్, కమలాపురానికి చెందిన బోయిల్ల శశితోపాటు రాగి తీగను కొనుగోలు చేసిన లక్ష్మయ్యపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఏఎస్పీ వెల్లడించారు. నిందితుల నుంచి రెండు బైక్‌లు, కత్తి, 51 కిలోల కాపర్ తీగ, 6 సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

భీమారంలో చోరీ

హసన్‌పర్తి: భీమారంలోని అలకానంద కాలనీలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఈ సంఘటనలో రూ.15వేల నగదు, 9తులాల బంగారం అపహరణకు గురైంది. బాధితురాలు కేయూ పీఎస్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. కాలనీకి చెందిన కె.శ్రీదేవి తన కుటుంబసభ్యులతో కలిసి బుధవారం ఇంటికి తాళాలు వేసి... డాబాపై పడుకున్నారు. ఉదయం నిద్ర లేచి చూసేసరికి ఇంటి తలుపులు ధ్వంసమై కనిపించాయి. లోనికి వెళ్లగా బీరువా పగుళ్లగొట్టి ఉండగా, అందులోనుంచి రూ.15వేలు నగదుతో పాటు 9 తులాల బంగారం కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 602/A, Rampur Village, Dharmasagar Mandal, Warangal dist - 506151, T.G, and Printed at Jagati Publications Limited,Survey No. 602/A, Rampur Village, Dharmasagar Mandal, Warangal dist - 506151.
Editor: V.Murali,(Responsible for selection of News under the PRB Act) Phone No. 08711-223111, Fax No.08711- 223330, RNI Regn No. TEL TEL/2008/23806. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.